




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 251 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 02 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలన

# వైకుంఠపాలి కాకూడదు

- నంద్యాలలో వైఎస్ విగ్రహం ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే
- విద్వేషాలు రగిల్చేలా వైసీపీ వివాదాలు సృష్టిస్తోంది
- కూటమి వచ్చినప్పటి నుంచి రూ.65,887 కోట్ల మేర పెన్షన్ల పంపిణీ
- "పీఎం సేతు"తో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- విశాఖ రైల్వే జోన్ తో రాష్ట్ర ప్రజల కల సాకారం
- సంక్షేమంలో మా ప్రజా ప్రభుత్వానికి సాటి లేదు
- కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు
- తుని పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలన వైకుంఠపాళి కాకూడదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకం కలిగిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా వైసీపీ కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతోందని సీఎం అన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన కొన్ని ఘటనల్ని ప్రస్తావిస్తూ వైసీపీ నేతల డ్రామాలను ఎండగట్టారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తుని మండలం చామవరంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన సోమవారం మిగతా .. 2లో..



### చెట్టు నుంచి దింపిన

## తాజా కల్లు రుచి చూసిన సీఎం

- కాకినాడ జిల్లాలో కల్లుగీత కార్మికుడి ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబు
- పోలరపు సింహాచలం అనే కార్మికుడికి స్వయంగా పింఛను అందజేత
- కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు ఆదేశం



**చామవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతున్నారు. సోమవారం కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో పర్యటించిన ఆయన, కల్లుగీత కార్మికుడు పోలరపు సింహాచలం ఇంటికి స్వయంగా వెళ్లారు. ఆయనకు రావాల్సిన పింఛనును చేతికి అందించి ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా సింహాచలం కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం, వారి మిగతా .. 2లో..

### ఏపీలో జూన్ 7 నుంచి

## యోగా కార్యక్రమాలు

### వీడియోల కోసం ప్రత్యేక నంబర్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ సారి 2.5 లక్షల మందిని యోగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయాలని, వెస్ట్రన్ బైపాస్‌లో 25 వేల మందితో యోగా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. యోగా, నేచురోపతి సలహాదారు మంతెన సత్యనారాయణ మాట్లాడుతూ యోగాపై ఐదు నిమిషాల నిడివితో 90 వీడియోలు రూపొందించినట్లు చెప్పారు. 21 వ్యాధులకు సంబంధించి 15 నిమిషాల నిడివితో యోగా వీడియోలు, మిగతా .. 2లో..

# పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పన్నుల ఎగవేతదారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం.. డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!
- గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి - పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ రంగాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరులు తమ పన్నులను క్రమబద్ధంగా చెల్లిస్తున్నప్పుడు.. పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తమ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. "సాధారణ ప్రజలు ఎంతో నిజాయతీగా పన్నులు కడుతున్నారు. మరి పరిశ్రమలు, మిగతా .. 2లో..

### జనసేన సభకు

## అనుమతి నిరాకరణ

### కారణాలు వెల్లడించిన డీసీపీ

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శేరిలింగంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సమావేశం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వడం లేదని డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. శాంతిభద్రతల సమస్యలు, పార్కింగ్ సదుపాయం లేకపోవడం వంటి కారణాలతో మిగతా .. 2లో..

### డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాల్లేవు..

## అంతా పారదర్శకమే

### స్పష్టం చేసిన ఏపీ ప్రభుత్వం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో నిర్వహించిన మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల ప్రక్రియపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియ గతంలో ఎన్నడూ లేనంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా జరిగిందని క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ స్పష్టం చేశారు. సోమవారం నాడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల నేపథ్యంలో వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**కొత్త క్రీడా విధానం, పెరిగిన రిజర్వేషన్లు**

రాష్ట్ర విభజన తర్వాత 2017లో తొలిసారిగా క్రీడా విధానాన్ని తీసుకొచ్చామని, అది 2022 వరకు అమల్లో ఉందని మిగతా .. 2లో..

### డీఎస్సీతో ఒక్క పోస్టు భర్తీ చేయని

## వైసీపీకి విమర్శించే హక్కు లేదు

- కూటమి సంక్షేమం చూసి ఓర్వలేకే వైసీపీ తప్పుడు ప్రచారం
- త్వరలోనే విద్యుత్ శాఖలో ఏఈ పోస్టులను భర్తీ చేస్తాం
- పల్నాడు జిల్లాకు రూ.400 కోట్ల వ్యయంతో 21 వేల పీఎం సూర్యఘర్ కనెక్షన్లు
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**పల్నాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేశామని పల్నాడు జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మిగతా .. 2లో..

## ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో లోకేష్ భేటీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. ముంబైలోని వర్షా బంగ్లాలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. లోకేష్ ఆయనకు తిరుమల శ్రీవారి ప్రతిమ, మంగళగిరి శాలువా బహూకరించగా, ఫడ్నవీస్ గణేశుడి మిగతా .. 2లో..

### మంచి ఒప్పందానికి

## చేరువయ్యాం

### ట్రంప్ వెల్లడి



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో చాలా మంచి ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు చేరువయ్యామని, ఒకవేళ తాము అనుకున్నది జరగకపోతే ముగింపు వేరే విధంగా ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'తొందరపడితే మంచి ఒప్పందం కుదరదు. అందుకే నెమ్మదిగా, ఖాయంగా మేం అనుకున్నది సాధించబోతున్నాం. ఇరానీయులు బాగా మంతనాలు జరుపుతారు. అయితే సైనిక పరంగా ఆ దేశం ఓడిపోయింది. ఆ దేశ నౌకాదళాన్ని, వాయుసేనను మేం సర్వనాశనం చేసేశాం. సైనిక స్థావరాలను మాత్రం పూర్తిగా మిగతా .. 2లో..

### వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది

## వైసీపీ కార్యకర్తే

### ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతోందని ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించి, శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని, కూటమి కార్యకర్తలు వైసీపీ ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా ముదిగేడులో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహంపై దాడి చేసింది వైసీపీ కార్యకర్త జంబులయ్యేనని మిగతా .. 2లో..

## రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు నోటిఫికేషన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు, మూడు రాష్ట్రాల శాసన మండలి స్థానాలకు ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ స్థానాలతో పాటు పదవీకాలం ముగియకుండానే ఖాళీయైన మూడుస్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో మొత్తం 27 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నేటి నుంచి ఈ నెల 8వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. బిహార్‌లోని తొమ్మిది రాష్ట్ర శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరగనుండగా ఒక స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

## అందుకే సూట్ వేసుకుంటున్నా..

### అసలు విషయం చెప్పిన సీఎం విజయ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ మొదటి సారి బహిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. తిరుచ్చిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో తన పార్టీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాకుండా ప్రజల సేవకుడిగా పని చేస్తానన్నారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు లభిస్తుందని దృఢంగా నమ్ముతున్నానని అన్నారు. ఎన్నికల్లో తన విజయాన్ని దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ విజయంతో పోలుస్తున్నారని విజయ్ పేర్కొన్నారు. కానీ తాను అంత గొప్ప నేతతో పోల్చుకోవట్లేదని.. ఎంజీఆర్, అన్నా, పెరియార్ చూపిన మార్గంలో పని చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎటువంటి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### చెట్టు నుంచి దింపిన

## తాజా కల్లు రుచి చూసిన సీఎం

జీవన విధానం గురించి ఆరా తీశారు. అత్యంత శ్రమతో కూడిన కల్లుగీత వృత్తిలోని కష్టనష్టాలు, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో, తమకు సొంత ఇల్లు లేదని సింహాచలం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. ఆ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అనంతరం, తాటి చెట్టు నుంచి కల్లు తీసే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. గీత కార్మికులు అప్పుడే తీసిన తాజా తాటి కల్లును రుచి చూశారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పేద ప్రజల సంక్షేమమే తన ప్రభుత్వ లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

## “ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలన వైకుంఠపాళి కాకూడదు”

హాజరయ్యారు. ప్రజా వేదిక సభకు హాజరై ప్రసంగించిన సీఎం చంద్రబాబు వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రజల ముందు ఉంచారు. ఆ పార్టీ నేతలు ఫ్రస్ట్రేషన్ తో ప్రతీ అంశాన్నీ వివాదం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... “గత పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రీ పగలు శ్రమిస్తున్నాం. వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగిస్తోంది. సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు కుతంత్రాలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని హత్యచేసి తొలుత గుండెపోటు అన్నారు. గొడ్డలితో నరికి చంపి డ్రామాలు ఆడారు. ఒక్క ఛాన్స్ అని మోసం చేసి కోడికత్తి, గులకరాయి నాటకాలు వేశారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనల్ని ప్రజలు తెలుసు కోవాలి. గత పాలకులు ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే 241 కోర్టు కేసులు పరిష్కరించాకే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. గతంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఎగ్గొట్టారు. మేం వచ్చాకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. అత్యంత పటిష్టంగా టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ జరిగింది. 40 వేల ప్రశ్నలు, 25 రకాల ప్రశ్నాపత్రాలతో ఎక్కడా అక్రమాలు జరగకుండా భర్తీ ప్రక్రియ నిర్వహించాం. ఫ్రస్టేషన్ లో ఉన్న వైసీపీ దీనిని కూడా వివాదం చేసి రాజకీయ లబ్ది పొందాలని ఆలోచన చేసింది. సమాజంలో అశాంతిని రేపాలని ప్రయత్నాలు జరిగాయి. జాగ్రత్తగా ఉండబట్టే గట్టిగా సమాధానం ఇవ్వగలిగాం. పరామర్శలకు వెళ్తూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లోకి విసిరేసి పోయారు. కడపకు చెందిన ఓ పాస్టర్ ను పంపి హత్యాయత్నం అంటూ డ్రామాలు ఆడారు. దానిని మా పార్టీ పై నెట్టేందుకు ప్రయత్నించారు. పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ ప్రమాదంలో చనిపోతే దానిని కూడా మాకు అంటగట్టాలని ప్రయత్నాలు జరిగాయి. సీసీ కెమెరాల సాయంతో ఈ కుట్రలను బట్టబయలు చేయగలిగాం. తిరుమలలోని కౌస్తుభం గెస్ట్ హౌస్ దగ్గర సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లను పారేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నం చేశారు. సాక్షాత్తూ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని అప్రతిష్ట పాల్జేసేందుకు ప్రయత్నం చేసిన వారిని ఏమనాలి. వారిది వేరే మతం కావొచ్చు. దానికి మేం తప్పు పట్టటం లేదు. కానీ కుట్రలతో హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్రం చేసే కుట్రలు సరికాదని హెచ్చరిస్తున్నాను. కడపలో పెద్ద దస్తగిరిని వైసీపీ వారే ఆస్తుల వివాదంలో హత్యచేసి టీడీపీ వారిపై నెట్టేందుకు ప్రయత్నం చేశారు. నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే. వైసీపీ వాళ్లే ధ్వంసం చేశారు కాబట్టే సాక్షి పత్రికలో ఆ వార్తే రాయలేదు. కాకినాడలోనే వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేశారు. కానీ వైసీపీ ఆ ఎమ్మెల్సీకి సన్మానాలు చేసింది. రాజకీయ పార్టీగా ఈ తప్పిదాలు సరిచేసుకోకుండా ఎదురుదాడి చేస్తున్నారు. కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతున్నవారి ఆటలు సాగనీయం. “అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**తొలి రోజు నుంచే పేదల సంక్షేమం కోసం పని చేస్తున్నాం ...**

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే పేదల సంక్షేమం కోసం పని చేస్తోందని చెప్పారు. అందుకు నిదర్శనమే పెన్షన్ల పెంపు అని తెలిపారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలు ఉన్నా...పెన్షన్లు ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4 వేలు చేశాం. దివ్యాంగులకు రూ.6,000 చేశాం. హెల్త్ పెన్షన్లు రూ.10 వేలకు, రూ.15 వేలకు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో అందించాం. ఏడాదికి దాదాపు రూ.32 వేల కోట్లు ఈ ఒక్క పథకానికే ఖర్చు పెడుతున్నాం. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో, ఇంత ఎక్కువ మందికి పింఛన్లు ఇవ్వడం లేదు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం ఉంటుంది తప్ప ప్రజలను కలిసి వారి కష్ట సుఖాలు తెలుసుకునే పరిస్థితి ఉండదు. అందుకే ప్రతీ నెలా 1 తేదీన ప్రజలను నేరుగా కలుసుకుని పెన్షన్లు అందిస్తున్నాం. రాష్ట్రంలో 62.34 లక్షల మందికి, రూ.2,729 కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నాం. ఈనెల కొత్తగా మరో 5,606 మందికి రూ.2.24 కోట్లు స్పౌజ్ పెన్షన్ల కోసం మంజూరు చేశాం రాష్ట్రంలో చాలా మంది పేద కుటుంబాలకు 2-4 సంక్షేమ పథకాలు అందుతున్నాయి. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్ సేవలో, మత్స్యకారుల సేవలో ఇలా వేర్వేరు పథకాలు వస్తున్నాయి. ఈ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించేలా చర్యలు చేపట్టాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు కూడా మన యువతకు వస్తాయి. మన రాష్ట్ర యువత ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా పరిశ్రమలు తెస్తున్నాం. కాకినాడ సమీపంలో గ్రీన్ అమ్మోనియో పరిశ్రమను రూ.80 వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. తుని పక్కనే అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ ఓ స్టీల్ సిటీని ఏర్పాటు చేస్తోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరుతున్నాం. పీఎం సేతు కింద యువతకు స్కిల్ డెవలప్మెంట్ చేస్తున్నాం. ఏడాదికి 25 వేల మంది యువతకు శిక్షణను పీఎం సేతు కింద ఇస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ కేంద్ర సహకారంతో తిరిగి పునరుద్ధరించాం. అలాగే విశాఖ రైల్వే జోన్ కల కూడా సాకారమైంది.” అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**ఆదర్శవంతమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ...**

“పేదలకు విద్య, వైద్యంలో అత్యంత నాణ్యమైన సేవలు అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్య కోసం పాఠశాలల్లో సంస్కరణలు తీసుకు వచ్చాం. పాఠ్యాంశాలు మారుతున్నాయి. నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులు చేయకుండా యూనివర్సల్ హెల్త్ పాలసీ కూడా తీసుకు వస్తున్నాం. సంజీవని పేరిట వ్యక్తిగత ఆరోగ్యం కోసం డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందించి పర్యవేక్షిస్తాం. మెరుగైన జీవితాన్ని ప్రజలకు అందించేలా ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో సంజీవని అమలు చేస్తాం. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేలా ప్రజా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది కూడా జూన్ లో యోగాంధ్ర కార్యక్రమాన్ని కూడా అమరావతిలో నిర్వహిస్తున్నాం.14 రోజుల పాటు నిర్వహించే యోగాలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా పాల్గొనాలని పిలుపును ఇస్తున్నాను. వ్యాయామం, యోగా, మెడిటేషన్ లాంటివి చేస్తూ మన ఆరోగ్యాన్ని మనమే పరిరక్షించు కోవాలి. ఆంధ్రప్రదేశ్ను ఆదర్శవంతమై రాష్ట్రంగా తీర్చిదిద్దేలా 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించాం. ప్రజలకు అందించే ప్రతీ పౌర సేవా సక్రమంగా, నాణ్యంగా అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి వరకూ విశాఖ రీజియన్ గా పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకూ అమరావతి రీజియన్ గా తిరుపతి కేంద్రంగా రాయలసీమ రీజియన్ ను అభివృద్ధి చేస్తున్నాం. పశ్చిమ ఆసియా యుద్ధ ప్రభావం మనపై పడింది. ఈసారి ఎల్ నినో కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. దీనికి మనం అంతా సన్నద్ధం కావాలి. సమర్ధ నీటి నిర్వహణతో ముందుగానే కాలువలకు నీళ్లు ఇవ్వగలిగాం. 2027 గోదావరి పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది జూలై లోగా పోలవరం ఎడమ కాలువ పూర్తి చేసి విశాఖ వరకూ నీరు తీసుకెళ్తాం. మత్స్యకార మహిళలకు సీవీడ్ ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నాం. మన మత్స్యకారులకు రూ.240 కోట్లతో 200 మెకనైజ్డ్ బోట్లు సబ్సిడీపై అందిస్తాం. అమినాబాద్ ఫిషింగ్ హార్బర్ కోసం రూ.80 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4...**

కాకినాడ జిల్లాలో పౌరసేవలు సంతృప్తిగా అందించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని సీఎం సూచించారు. పేదల సేవలో కార్యక్రమంలో పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులు బంగారు కుటుంబాలతో సీఎం మాట్లాడారు. పేదరికం లేని సమాజాన్ని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని అన్నారు. బంగారు కుటుంబాల్లో విద్యాధికులుగా, ఆదాయం ఆర్జించే వ్యక్తులుగా మారాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం వివరించారు.

**జూన్ 4 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విముక్తి దినం...**

రెండేళ్ల క్రితం విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగింది. జూన్ 4వ తేదీ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నిలిచిపోయే రోజని, గత ప్రభుత్వం ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసిందని, విధ్వంసక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించిన రోజుగా గుర్తుండి పోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గత పాలన అంతా విధ్వంసకర పాలన, బహిరంగంగా నవ్వాలని అనుకున్నా ప్రజలంతా భయపడే పరిస్థితి. ప్రజలు వెళ్లి పోకుండా కందకాలు తవ్వి, ఫెన్సింగ్ లు వేసి మరీ సమావేశాలు నిర్వహించారని చంద్రబాబు విమర్శించారు.

**“నేను కూడా బటన్ నొక్కవచ్చు”...**

ముఖ్యమంత్రులు బటన్ నొక్కటంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను కూడా బటన్ నొక్కవచ్చని.. కానీ, నేరుగా వచ్చి పింఛన్ అందించి, అధికారుల పనితీరును పర్యవేక్షిస్తే కలిగే ఆనందమే వేరని అభిప్రాయపడ్డారు. నేరుగా పేదవాడి ఇంటికి వచ్చి పింఛన్ అందించినప్పుడు, అధికారులు సరిగ్గా పనిచేస్తున్నారా లేదా అని పరిశీలించి నప్పుడు కలిగే ఆనందం.. బటన్ నొక్కితే ఉండదని చంద్రబాబు చెప్పు కొచ్చారు. గతంలో ఏదైనా కారణంతో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే.. వెంటనే రద్దు చేసేవారని చంద్రబాబు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నెలల పింఛన్ ఒకేసారి తీసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ఒక్కో కుటుంబానికి 3 లేదా 4 సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు.

**దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరించిన సీఎం.**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన అభిమాని ఐన ఓ దివ్యాంగ యువకుడిని ఆప్యాయంగా పలకరించారు. సీఎం స్వయంగా అతని దగ్గరకు వెళ్లి భుజంపై చేయి వేసి ఫోటో దిగడంతో ఆ దివ్యాంగ యువకుడు సంతోషంతో ఉప్పొంగి పోయాడు. యువకుడి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతూ, ‘మీరంటే మా కుమారుడికి ఎంతో అభిమానం’ అని తెలిపారు. వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ను పిలిచిన సీఎం.. ప్రభుత్వం తరఫున దివ్యాంగ యువకుడికి అన్ని సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం. చంద్రబాబు సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ ఉద్యాన పంటల సాగు మైక్రో న్యూట్రియంట్స్ తో పాటు ప్రకృతి సేద్యం దిశగా కృషి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే యనమల దివ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు అయ్యారు.

## జనసేన సభకు అనుమతి నిరాకరణ

ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. డీసీపీ మీడియాతో మాట్లాడుతూ జనసేన ప్రధాన కార్యదర్శి తమను కలిసి సభకు అనుమతి కోరారని తెలిపారు. ఈ సమావేశానికి సుమారు 2,000 మంది కార్యకర్తలు వస్తారని దరఖాస్తులో పేర్కొన్నారని చెప్పారు. అయితే, ఇటీవల ఏపీ నేతలు చేసిన కొన్ని వ్యాఖ్యల కారణంగా తెలంగాణలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని తెలిపారు. ముఖ్యంగా ప్రొఫెసర్ నాగేశ్వరరావుపై ఆంధ్రప్రదేశ్లో కేసులు నమోదు కావడంతో ఇక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చెలరేగే ప్రమాదం ఉందని అన్నారు. దీంతో పాటు, సభకు వచ్చే రెండు వేల మందికి సరిపడా పార్కింగ్ సౌకర్యం లేదని కూడా తెలిపారు. జనసేన నేతలు పార్కింగ్ కోసం ఎఫ్సీఐకి చెందిన భూమిని ఉపయోగించుకోవాలని భావించినా, ఆ భూమిపై కోర్టులో కేసులు పెండింగ్లో ఉన్నాయని గుర్తించామని... ఈ కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే ఉద్దేశంతో సభకు అనుమతి నిరాకరించినట్లు డీసీపీ స్పష్టం చేశారు.

## పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రైవేట్ విద్యాసంస్థలు పంచాయతీలకు చెల్లింపులు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? ఎందుకు ఎగవేస్తున్నాయి?” అని పవన్ నిలదీశారు. పన్నుల రికవరీ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉపముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదరు సంస్థల నుంచి పెండింగ్లో ఉన్న అన్ని పన్నులను పూర్తిగా రికవరీ చేయడానికి కఠినమైన విధానాన్ని అవలంబించాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించని డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలపై తక్షణమే అవసరమైన చట్ట పరమైన చర్యలను ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## అంతా పారదర్శకమే

అజయ్ జైన్ తెలిపారు. ఆ తర్వాత రెండేళ్లు పాలసీ లేకపోవడంతో, కొత్త ప్రభుత్వం డిసెంబర్ 2024లో జీవో 18 ద్వారా నూతన క్రీడా విధానాన్ని అమల్లోకి తెచ్చిందని వివరించారు. ఈ విధానంలో క్రీడలను ప్రోత్సహించడం, పారా-స్పోర్ట్స్ అథ్లెట్లకు గుర్తింపు, మహిళలు, వెటరన్లకు ప్రాధాన్యత వంటి అంశాలు చేర్చామన్నారు. ముఖ్యంగా, ఉద్యోగాల్లో క్రీడాకారులకు ఉన్న 2 శాతం రిజర్వేషన్ను 3 శాతం హారిజాంటల్ రిజర్వేషన్గా పెంచినట్లు గుర్తుచేశారు. ఈ రిజర్వేషన్లు కేవలం ఉద్యోగాలకే కాకుండా, ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలకు కూడా వర్తిస్తాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పర్సనల్, పబ్లిక్ రిలేషన్స్ అండ్ పెన్షన్స్ మంత్రిత్వ శాఖ 2024 మార్చి 4న జారీ చేసిన మెమోరాండం ఆధారంగా 65 క్రీడాంశాలను గుర్తించి, వాటిని కేటగిరీ ‘ఏ’, ‘బీ’లుగా విభజించినట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో 96 ప్రాధాన్యతాంశాలను నిర్దేశించామని, ఒలింపిక్స్లో పతకం సాధించిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని, ఆ తర్వాత ఏషియన్ గేమ్స్, వరల్డ్ కప్, కామన్వెల్త్, జాతీయ క్రీడల నుంచి రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ వరకు ప్రాధాన్యతలు ఉంటాయని వివరించారు.

**తొలిసారిగా పూర్తి ఆన్లైన్ ప్రక్రియ**

డీఎస్సీలో భాగంగా మొత్తం 16,347 పోస్టులకు నోటిఫికేషన్ రాగా, 3 శాతం కోటా కింద 431 పోస్టులు క్రీడాకారులకు కేటాయించినట్లు అజయ్ జైన్ తెలిపారు. ఈ ప్రక్రియను తొలిసారిగా పూర్తి పారదర్శకంగా, ఆన్లైన్ విధానంలో నిర్వహించామన్నారు. గతంలో మాన్యువల్గా జరిగిన ప్రక్రియలకు భిన్నంగా, ఈసారి అభ్యర్థులు అధికారులను నేరుగా కలిసే అవకాశం లేకుండా చేశామన్నారు. ఏపీసీఎఫ్ఎస్ఎస్ రూపొందించిన సురక్షిత సాఫ్ట్వేర్ ద్వారానే దరఖాస్తులు స్వీకరించామని, మొత్తం 3,600 మంది అభ్యర్థుల నుంచి 5,326 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. డీఎస్సీ నిర్దేశించిన కనీస విద్యార్హతలు ఉన్న క్రీడాకారులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని, అర్హతల్లో ఎటువంటి మినహాయింపులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఆసక్తికరంగా, 421 పోస్టులకు గానూ 382 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయని, అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో 39 పోస్టులు మిగిలిపోయాయని వెల్లడించారు.

**బహుళస్థాయిలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్**

ఈ నియామకాల్లో కీలకమైన సర్టిఫికెట్ల జారీలో ప్రభుత్వానికి గానీ, శాప్కు గానీ ఎలాంటి పాత్ర లేదని అజయ్ జైన్ తేల్చిచెప్పారు. 2011 నుంచి అమల్లో ఉన్న జాతీయ క్రీడా అభివృద్ధి కోడ్ (చీుణజ) మార్గదర్శకాల ప్రకారం, సంబంధిత క్రీడా సమాఖ్యలు, అసోసియేషన్లు, విశ్వవిద్యాలయాలు మాత్రమే సర్టిఫికెట్లను జారీ చేస్తాయని అన్నారు. శాప్ బాధ్యత కేవలం వాటిని వెరిఫై చేయడం వరకే పరిమితమని స్పష్టం చేశారు. వెరిఫికేషన్ ప్రక్రియను వివరిస్తూ.. మొదట ఆరుగురు సభ్యులతో కూడిన స్క్రూటినీ కమిటీలను ఏర్పాటు చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేసిన సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. ఆ తర్వాత 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచి, వారి ఒరిజనల్ సర్టిఫికెట్లను భౌతికంగా పరిశీలించామన్నారు. అనంతరం, సంబంధిత క్రీడా సమాఖ్యలకు లేఖలు రాసి సర్టిఫికెట్ల వాస్తవికతను నిర్ధారించుకున్నామని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక టెంటేటివ్ జాబితాను ఆన్లైన్లో ప్రచురించి, అభ్యంతరాలను స్వీకరించామన్నారు. వచ్చిన 192 గ్రీవెన్స్లను పరిశీలించిన తర్వాత, నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన రాష్ట్రస్థాయి కమిటీ తుది జాబితాను ఆమోదించిందని, దానిని విద్యాశాఖకు పంపామని వివరించారు.

**ఆరోపణలపై స్పష్టత**

డబ్బులు ఇస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు మధ్యవర్తులు ప్రచారం చేసినట్లు గత ఏడాది జులైలో తమ దృష్టికి రాగానే, శాప్ తరపున తామే స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేశామని అజయ్ జైన్ తెలిపారు. ఈ ఘటనలో బుంత రోశయ్య అనే వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారని, అతనికి శాప్తో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక అభ్యర్థిని (వెంకటలక్ష్మి) రెండు పుట్టిన తేదీలతో ఉద్యోగం పొందిందన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. ఆమె అన్ని ధ్రువపత్రాల ప్రకారం ఒకే పుట్టిన తేదీతో దరఖాస్తు చేసిందని, ఆమెపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని విజయనగరం ఎస్పీ ధృవీకరించారని తెలిపారు. ఆమె సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్ను కూడా సంబంధిత ఫెడరేషన్తో వెరిఫై చేశాకే ఉద్యోగం ఇచ్చామన్నారు. ఈ నియామకాలపై మొత్తం 69 కోర్టు కేసులు దాఖలయ్యాయని, వాటిలో 3 కేసులు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రాగా, 66 కేసులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసి, అన్ని ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఫేక్ సర్టిఫికెట్లతో ఎవరైనా ఉద్యోగం పొందినట్లు నిర్దిష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే, విచారణ జరిపి సదరు అభ్యర్థితో పాటు, సర్టిఫికెట్ జారీ చేసిన అసోసియేషన్పైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తం మీద, ఈ నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో జరిగిందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఏపీలో జూన్ 7 నుంచి యోగా కార్యక్రమాలు

యోగా పట్ల అపోహలు తొలగించేలా మరో 50 వీడియోలు సిద్ధం చేశామన్నారు. 81424 04888కు హాయ్ అని వాట్సప్లో మెసెజ్ పెడితే లింక్ వస్తుందని, అందులో నుంచి యోగా వీడియోలు డౌన్లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

## మంచి ఒప్పందానికి చేరువయ్యాం

ధ్వంసం చేయలేదు. ఐచ్ఛికాలన్నీ మా చేతిలో ఉన్నాయి. ఒప్పందం కుదిరితే మంచిదే. లేదంటే మా ‘యుద్ధ విభాగం’ తన పనిని ప్రారంభిస్తుంది’ అని ట్రంప్ వివరించారు. తన కోడలు లారా ట్రంప్నకు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూ శనివారం రాత్రి ఫాక్స్ న్యూస్లో ప్రసారమైంది.

## వైసీపీకి విమర్శించే హక్కు లేదు

తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక మెగాడీఎస్సీలో అక్రమాలు జరిగాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో డీఎస్సీ ద్వారా ఒక్క పోస్టును కూడా భర్తీ చేయని వైసీపీకి, కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పోలీసు శాఖలో ఉద్యోగాల భర్తీ చేపట్టామని, త్వరలోనే ఏఈ పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా ప్రారంభిస్తామని తెలిపారు. తాము చేయలేని పనులను కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందనే అసహనంతో వైసీపీ నేతలు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. సోమవారం నాడు పల్నాడు జిల్లా నకరేకల్లు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కండ్లగుంట గ్రామంలో శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే రూ.400 కోట్ల వ్యయంతో 21 వేల పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా కోటి సూర్యఘర్ కనెక్షన్ల లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుండగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఆంధ్రప్రదేశ్కు 20 లక్షల కనెక్షన్లు కేటాయించబడినట్లు మంత్రి వెల్లడించారు. ఈ 20 లక్షల కనెక్షన్లు పూర్తయితే రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ముఖ్యంగా ఓసీ, బీసీ వర్గాలకు చెందిన వినియోగదారులకు గణనీయమైన రాయితీలు లభిస్తున్నాయని తెలిపారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతో పాటు స్వయం విద్యుత్ ఉత్పత్తికి ఈ పథకం దోహదపడుతుందని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ‘తల్లికి వందనం’ పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10 వేల కోట్లకు పైగా జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్తో లోకేష్ భేటీ

విగ్రహాన్ని అందజేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక అంశాలు, ఏపీలో పెట్టుబడులు, వ్యాపార అనుకూల విధానాలు, విద్యా సంస్కరణలపై వారు చర్చించుకున్నారు. లోకేష్ తన ముంబై పర్యటనలో, ఎయిర్ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో లోకేష్ సమావేశమై విశాఖపట్నం ప్రాధాన్యతను వివరించారు. వైజాగ్ను ఐటీ, ఏఐ హబ్గా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. విశాఖలో కొత్త క్యాంపస్ను ఏర్పాటు చేయాలని ఎయిర్ట్రంక్ను లోకేష్ ప్రత్యేకంగా కోరారు. లోకేష్ ప్రజెంటేషన్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎయిర్ట్రంక్ సీఈఓ సానుకూలంగా స్పందించారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు అవకాశాలను తీవ్రంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఐటీ రంగంలోకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా లోకేష్ ఈ పర్యటనలు చేపడుతున్నారు.

## వైసీపీ కార్యకర్తే

మంత్రి స్పష్టం చేశారు. తాము వైసీపీ మద్దతుదారులమంటూ అతని భార్య వీడియో విడుదల చేసిందని, స్థానిక వైసీపీ కార్పొరేటర్ శేషయ్యే తమకు ఉద్యోగం ఇప్పించారని ఆమె స్వయంగా అంగీకరించిందని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే, ఈ కుట్రలో తెలుగుదేశం పార్టీని ఇరికించేందుకు వైసీపీ ప్రయత్నించిందని ఆయన మండిపడ్డారు. 1995లో చంద్రబాబు సీఎం అయినప్పటి నుంచే ఫ్యాక్షనిజంపై ఉక్కుపాదం మోపారని ఆయన గుర్తుచేశారు. గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి కేవలం 11 సీట్లకు పడిపోయిన ఆ గొడ్డలి పార్టీ నాయకులకు తమ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎండగట్టారు.

## అందుకే సూట్ వేసుకుంటున్నా..

రాజీ ఉండబోదన్నారు. డీఎంకే- అన్నాడీఎంకేపై విజయ్ విమర్శలు గుప్పించారు. ఆరు నెలలపాటు మౌనంగా ఉంటామని చెప్పినవారు.. ఆరు రోజులు కూడా మౌనంగా ఉండలేకపోయారని అసహనం వ్యక్తం చేశారు. కుటుంబ రాజకీయాల వల్లే డీఎంకే (ఐవీఖ) ఎన్నికల్లో ఓటమి చవిచూసిందన్నారు. ఇన్నేళ్లుగా వంతులవారీగా మోసం చేస్తున్న రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అయినప్పటికీ తన ప్రభుత్వాన్ని కూలదోసి అధికారం చేపట్టాలని ఆ పార్టీల నేతలు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. తమిళనాడు రాజకీయాల్లో ఇప్పటికీ ఎప్పటికీ పోటీ డీఎంకే-టీవీకే మధ్యే ఉంటుందన్నారు.

**సూట్ ఎందుకు వేసుకోలేదు..?**

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి విజయ్ బ్లాక్ అండ్ వైట్ సూట్లోనే అన్ని అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారు. బహిరంగ సభకు ఆయన సూట్లో రాకపోవడంతో మీరు సూట్ ఎందుకు వేసుకోలేదని ఓ వ్యక్తి ప్రశ్నించాడు. అందుకు ఆయన బదులిస్తూ.. అన్ని విషయాల్లో పారదర్శకంగా, నిరాడంబరంగా ఉంటానని చెప్పడానికే తాను తెలుపు-నలుపు కలిసి ఉన్న సూట్ వేసుకుంటున్నట్లు తెలిపారు. అదేమీ కేవలం ఉన్నతాధికారులు మాత్రమే వేసుకునే డ్రెస్ కోడ్ కాదు కదా అంటూ చిరునవ్వులు చిందించారు.

# ఎడిటర్ వాయిస్

## ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే : డబుల్ కన్ఫ్యూజన్ !

కేంద్రంలో ఎన్డీయే రాష్ట్రంలో ఎన్డీయే. ఇలా రెండు ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ సర్కార్ గా ముందుకు దూసుకుని పోతున్నాయని ఇప్పటికి ఎన్నో సార్లు కూటమి పెద్దలు చెబుతూ వస్తున్నారు. అక్కడా ఇక్కడా ఒకే పాలన సాగడం వల్ల అభివృద్ధి వేగంగా అద్భుతంగా సాగుతుందని కూడా అంటూ వస్తున్నారు. అయితే కొన్ని కీలక అంశాలలోనే డబుల్ ఇంజన్ సర్కార్ లో భాగమైన ప్రజా ప్రతినిధుల మధ్య వైరుధ్యాలు కనిపిస్తున్నాయని గుర్తు చేస్తున్నారు. అభివృద్ధికి సంబంధించిన అంశాలుగా ఇవి ఉండడమే గమనార్హం.

**ఎయిర్ పోర్టు మీద భిన్న వైఖరి :** భోగాపురం ఎయిర్ పోర్టు విషయంలో విశాఖకు చెందిన టీడీపీ ఎంపీ అలాగే విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే మధ్య భిన్న వైఖరులు వ్యక్తం కావడం విశేషం. ఈ ఎయిర్ పోర్టు విశాఖకు ఎంతో దూరం అని కనీసం మూడు గంటలు పైగా సమయం అక్కడికి చేరుకోవడానికి పడుతుందని బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు అంటున్నారు. దాని వల్ల సమయం, ఇంధనం, డబ్బు అన్నీ వృధా అవుతాయని పైగా శ్రమ కూడా అవుతుందని ఎమ్మెల్యే చెబుతున్నారు. దానికి టీడీపీ ఎంపీ శ్రీ భరత్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.

**జస్ట్ 45 నిమిషాలు :** విశాఖ నుంచి భోగాపురం ఎయిర్ పోర్టు చేరుకోవడానికి జస్ట్ 45 నిముషాలు మాత్రమే పడుతుందని ఆయన అంటున్నారు. ఏమంతా దూరం కానే కాదని కొట్టి పారేస్తున్నారు. సులువుగానే అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎవరైనా చేరుకునే సదుపాయం ఉందని అంటున్నారు. ఈ విషయంలో బీజేపీ ఎమ్మెల్యే రాజు చేసిన వ్యాఖ్యలు కానీ అనుమానాలు ఆందోళలను కానీ ఎంపీ అయితే అసలు పట్టించుకున్నట్లు ఎక్కడా కనిపించడం లేదని అంటున్నారు.

**బీచ్ కారిడార్ విషయం :** అంతే కాదు బీచ్ కారిడార్ విషయం మీద కూడా ఎంపీ ఎమ్మెల్యేల మధ్య భిన్న వాదనలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. బీచ్ కారిడార్ చివరి దశలో ఉంది అని ఎంపీ భరత్ చెబుతూంటే అది ఇపుడపుడే అయ్యేది కాదని బీజేపీ ఎమ్మెల్యే రాజు తేల్చేస్తున్నారు. ఈ బీచ్ కారిడార్ ఎందుకు అంటే విశాఖ నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు డైరెక్ట్ గా వేగంగా చేరుకోవడానికి అన్న మాట. మరి అది కనుక అనుకున్నంత తొందరగా పూర్తి కాకపోతే ఎయిర్ పోర్టు కట్టినా జనాలకు రాకపోకలు ఇబ్బంది కదా అనందే రాజు గారి వాదన. కానీ అన్నీ అయిపోతాయి నిర్దిష్ట కాల పరిమితిలోనే అని ఎంపీ ధీమాగా చెబుతున్నారు.

**డొమెస్టిక్ ఎయిర్ పోర్టుగా :** భోగాపురం ఎయిర్ పోర్టుకు కనెక్టివిటీ రోడ్స్ కానీ కారిడార్ కానీ పూర్తి స్థాయిలో సిద్ధం అయ్యేంతవరకూ అయినా విశాఖ ఎయిర్ పోర్టుని కొనసాగించాలని రాజు కోరుతున్నారు. డొమెస్టిక్ ఎయిర్ పోర్టుగా ఉంచితే అభ్యంతరం ఏముందని ఆయన ప్రశ్నిస్తున్నారు. అంతే కాదు విశాఖలో ఒక ఎయిర్ పోర్టు భోగాపురంలో మరోటి ఉంటే కూడా అభివృద్ధి బాగా జరుగుతుంది కదా అని అంటున్నారు అయితే రాజు గారి సూచనలు సలహాల మీద కూటమి పెద్దలు ఎంత వరకూ ఆలోచిస్తున్నారో తెలియదు. కానీ టీడీపీ ఎంపీ భరత్ మాత్రం ఆల్ ఈజ్ వెల్ అంటున్నారు. సో డబుల్ ఇంజన్ సర్కార్ లో కీలకమైన రెండు పార్టీలు ఇద్దరు ప్రజా ప్రతినిధుల మధ్య అత్యంత కీలకమైన అంశంలో భిన్న వాదనలు వైఖరులు ఉండడం మాత్రం గమనార్హం. దాంతో అంతా డబుల్ ఇంజన్ లో డబుల్ కన్ఫ్యూజన్ అని సెటైర్లు వేస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## వికారాబాద్‌లోని మహవీర్ ఆస్పత్రిలో చిన్నారి మృతి



**వికారాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వికారాబాద్ జిల్లాలోని మహవీర్ ఆస్పత్రిలో ఐదు నెలల చిన్నారి మృతి చెందింది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. చిన్నారికి జ్వరం ఉందని ఆమె తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, ఆస్పత్రిలో చేర్చుకోవడంలోనూ, వైద్యం చేయడంలో డాక్టర్లు నిర్లక్ష్యం చేశారని, అందుకే పాప చనిపోయిందని కన్నీరు మున్నీరయ్యారు.

## ఏలూరులో తల్లీకూతుళ్ల అనుమానాస్పద మృతి

**ఉంగుటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నల్లమడు గ్రామ శివారులో తల్లీకూతుళ్ల మృతదేహాలు కలకలం రేపాయి. దూబచర్ల- చేబ్రోలు మార్గంలోని జీడిమామిడి తోటలో మృతదేహాలను గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతులను తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన తల్లీకూతుళ్లుగా గుర్తించారు. ఘటనాస్థలికి చేరుకున్న చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో ఒకరి తలకు బలమైన గాయమైనట్లు తెలుస్తోంది. ఇది హత్యేనా? ఇంకేమైనా కారణాలున్నాయా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

## గోదావరి నదిలో స్నానానికి వెళ్లి బావబావమరిది మృతి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో మునిగి బావబావమరిది మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని యాదమ్మ దిబ్బకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దేవర శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా సైపవరానికి చెందిన ఈపు నూకరాజు బావబావమరుదులు. సోమవారం వీరిద్దరూ పుష్కరఘాట్ వద్ద నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. లోతు గమనించక నదిలో దిగడంతో ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాలను వెలికితీశారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నూకరాజుకు కొన్ని రోజుల కిందటే వివాహమైందని బంధువులు తెలిపారు. నదీతీరంలో ఆహ్లాదంగా గడిపేందుకు వచ్చి బావబావమరుదులు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## డఫాబెట్.. బెట్టింగ్ కేసులో 11 మందిని అరెస్టు చేసిన సీఐడీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక నష్టం కలిగిస్తూ, యువత ఆత్మహత్యలకు కారణం అవుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై తెలంగాణ సీఐడీ ప్రత్యేక దృష్టి సారించింది. వీటిపై ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిన సీఐడీ.. ఓ కేసు దర్యాప్తులో భాగంగా అంతర్జాతీయ బెట్టింగ్ రాకెట్‌ను ఛేదించింది. బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ 'డఫాబెట్' వేదికగా మోసాలకు పాల్పడుతున్న 11 మందిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. కరీంనగర్‌కి చెందిన ఓ బాధితుడు డఫాబెట్‌లో దాదాపు రూ.10లక్షలు మోసపోయిన కేసులో దర్యాప్తు ప్రారంభించిన సీఐడీ.. న్యూ దిల్లీ, గుజరాత్, పంజాబ్‌కు బృందాలను పంపి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో ఒక అఫ్గానిస్థాన్ దేశస్థుడు సహా 11 మందిని అరెస్ట్ చేశారు. వీరంతా బెట్టింగ్ నిర్వాహకులని సీఐడీ చీఫ్ చారు సిన్హా తెలిపారు. నిందితుల నుంచి 3 కార్లు, 8 ల్యాప్‌టాప్‌లు, 26 మొబైల్స్, 5 పాస్‌పోర్టులు, రూ.3.21లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై ఏపీ, గుజరాత్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణలో 225 కేసులు ఉన్నట్లు తెలిపారు.

## రైలు ఢీకొని యువతి, బాలిక దుర్మరణం



**నందిగామ, విశ్వం వాయిస్ న్యూస్ :** పొట్టకూటి కోసం బిహార్ నుంచి వలస వచ్చారు. వంట కోసం కట్టెలు ఏరుకొని వస్తుండగా రైలు ఢీకొని ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదం రంగారెడ్డి జిల్లా నందిగామ శివారులో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ వివరాల ప్రకారం.. బిహార్‌లోని భోజ్‌పుర్ జిల్లాకు చెందిన ప్రీతి (22), దర్భంగా జిల్లాకు చెందిన చున్‌మున్‌కుమారి(15) తల్లిదండ్రులతో పాటు నందిగామ పారిశ్రామికవాడకు వచ్చి అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. కట్టెలు తీసుకురావడానికి ఆదివారం స్నేహితులతో కలిసి వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా.. గూడ్స్ రైలు రావడం గమనించి పక్కకి జరిగారు. అది డబుల్ లైన్ అని తెలియక పక్క లైన్‌పై ఆగారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న హంద్రీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొంది. లోకో పైలట్ శ్రీనివాస్ రైలు ఆపి, కొనఊపిరితో ఉన్నవారిని అదే రైలులో షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు దక్కలేదు. ప్రీతి ఓ పరిశ్రమలో కార్మికురాలు కాగా.. కుమారి స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది.

## స్నేహితులను కాపాడి.. తాను మృత్యుఒడికి

### అమెరికాలో తెలుగు యువకుడి విషాదాంతం



**అబ్దుల్లాపూర్‌మెట్, విశ్వం వాయిస్ న్యూస్ :** భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగు పెట్టాడు. అక్కడ విద్యాభ్యాసం పూర్తి చేసి, కొద్దిరోజుల్లో కలల కొలువులో చేరేందుకు సన్నద్ధమవుతున్నాడు. ఈలోపు స్నేహితులతో కలిసి సరదాగా క్యాంపింగ్‌కు వెళ్లాడు. అక్కడ ఈత కొడుతుండగా ఆపదలో చిక్కుకున్న స్నేహితులను కాపాడి... తాను మాత్రం మృత్యుఒడికి చేరాడు. అమెరికా లూసియానా టోరోడో పార్కులోని సెబాన్ నదిలో మునిగి కోడూరు అనురూప్‌రెడ్డి (23) అనే తెలుగు యువకుడు ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా శాలిగౌరారం ప్రాంతానికి చెందిన కోడూరు రాజేందర్‌రెడ్డి కుటుంబం హైదరాబాద్‌కు వలస వచ్చి, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఉదయ్‌గార్డెన్స్ కాలనీలో నివాసం ఉంటోంది. వారికి అశ్రిత్‌రెడ్డి, అనురూప్‌రెడ్డి సంతానం. 2023లో అశ్రిత్, 2024లో అనురూప్ అమెరికా వెళ్లారు. అనురూప్ ఇటీవలే యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశాడు. జూన్‌లో ఉద్యోగంలో చేరేందుకు సన్నద్ధమవుతున్నాడు. ఈలోపు స్నేహితులతో సరదాగా గడిపేందుకు లూసియానాలోని టోరోడో పార్కుకు వెళ్లాడు. అక్కడి సెబాన్ నదిలో ఈత కొడుతుండగా ముగ్గురు స్నేహితులు లోతైన ప్రదేశంలోకి జారిపోతూ రక్షించాలంటూ కేకలు వేయడాన్ని అనురూప్ గమనించాడు. ఒక్కొక్కరినీ పైకి లాగి ఒడ్డుకు చేర్చాడు. తాను ఒడ్డుకు వస్తుండగా కాలికి ఫిషింగ్ వైర్ చుట్టుకుంది. అదే సమయంలో ప్రవాహం పెరగడంతో అనురూప్ మునిగిపోయాడు. ఒడ్డునున్నవారు, ఈతగాళ్లు రక్షించేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. నీరు ఎక్కువగా మింగడంతో మృతి చెందాడు. సరదాగా గడిపేందుకు వెళ్లిన తమ్ముడిని విగతజీవిగా చూస్తాననుకోలేదని అశ్రిత్‌రెడ్డి తీవ్రంగా రోదించాడు. కుమారుడి మరణ వార్త తెలియడంతో తల్లిదండ్రులు రాజేందర్‌రెడ్డి, దుర్గాభవాని విషాదంలో మునిగిపోయారు. అనురూప్ మొదట్నుంచీ చదువుల్లో ప్రతిభావంతుడని... బీటెక్ చదువుతుండగానే మంచి ఉద్యోగావకాశం వచ్చినా.. తన లక్ష్యం కోసం అమెరికా వెళ్లాడని చెప్పారు. మృతదేహాన్ని భారతదేశానికి తీసుకొచ్చేందుకు టీఎం ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ, భారత రాయబార కార్యాలయం, లూసియానా కాన్సులేట్‌తో పాటు అశ్రిత్ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అనురూప్ కుటుంబానికి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కోరారు.

## విద్యార్థుల ఆశలు సజీవ సమాధి

### దిల్లీ భవన ప్రమాదంలో ఆరుగురి మృతి



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ రాజధానిలోని సాకేత్ ప్రాంతంలో శనివారం రాత్రి ఒక భవనం కూలిన ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. దక్షిణ దిల్లీలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కేంద్రాలతో రద్దీగా ఉండేచోట బహుళ అంతస్తుల భవనం కూలింది. శిథిలాల నుంచి 14 మందిని బయటకు తీశారు. చికిత్స పొందుతున్న వీరిలో ఐదుగురు ఎయిమ్స్‌లో, మరో వ్యక్తి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో మృతి చెందారు. వీరిని రవి (24), కపిల్ (28), నళిన్ రే (23), ఆలోక్, పార్వతి (35), ఏక్తా (24)గా గుర్తించారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ (ఎఫ్ఎంజీ), నీట్, గేట్ సహా వివిధ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సాకేత్ ప్రాంతంలో ఎక్కువగా ఉంటారు. కూలిన భవనంలో చాలాభాగం.. దానిపక్కనే రేకుల షెడ్డులో నడుస్తున్న క్యాంటీన్‌పై పడింది. భాభా అణు పరిశోధన సంస్థ (బార్క్)లో తన ఇంటర్వ్యూ బాగా జరిగినందుకు కపిల్ తన స్నేహితులకు తేనీటి విందును అక్కడ ఇస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో ఆ ఆనందాన్ని ఆస్వాదించకముందే ప్రాణాలు కోల్పోయాడు. తొలుత రాళ్లు, అద్దాలు, ఇటుకలు పడుతుండగా ఒక విద్యార్థి వీడియో తీయడం ప్రారంభించాడు. కొన్ని సెకన్లలోనే మొత్తం భవంతి కూలిపోయింది. ఇతర భవనాల్లో భోజనాలు చేస్తున్నవారు, చదువుకుంటున్నవారు ఉలిక్కిపడి పరుగులు తీశారు. దిల్లీలోనే మెహరౌలీ ప్రాంతంలో ఆదివారం రాత్రి మరో భవనం కూలి ముగ్గురు మృతి చెందారు.

# పిల్లలు పాఠశాలకు వెళ్తున్నారా?

## మిస్ చేయకూడని 5 ముఖ్యమైన విషయాలు ఇక్కడ ఉన్నాయి

వేసవి సెలవులు ముగియబోతున్నాయి, పాఠశాలకు వెళ్లే పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు ఇది అత్యంత సవాలుతో కూడిన సమయాల్లో ఒకటి. వేసవి సెలవుల గందరగోళం నిర్మాణాత్మక స్థితికి దారితీయాలి మరియు పిల్లలు వారి విద్యా పెరుగుదల మరియు భావోద్వేగ శ్రేయస్సుకు మద్దతు ఇచ్చే దినచర్యకు తిరిగి రావాలి. పిల్లలు మరియు టీనేజ్‌కు ముందు పిల్లలకు, తరగతి గదికి తిరిగి వెళ్ళడం సజావుగా ఉండాలి. మీ పిల్లలు సజావుగా మారడానికి సహాయపడే ఐదు ఆచరణాత్మక మరియు ప్రభావవంతమైన బ్యాక్-టు-స్కూల్ తయారీ చిట్కాలు ఇక్కడ ఉన్నాయి.

**దినచర్యను తిరిగి తీసుకురండి**

ఈ పరివర్తనలో అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీ పిల్లల జీవితంలో ఒక దినచర్యను తిరిగి స్థాపించడం. ఉదయం పూట అదనపు నిద్ర మరియు రాత్రి ఆలస్యంగా పడుకునే అలవాట్లన్నింటినీ ముగించాలి. రాత్రిపూట అలా చేయడానికి ప్రయత్నించే బదులు, అరగంట సర్దుబాటు చేయడం ద్వారా ప్రారంభించండి, ఆపై నెమ్మదిగా వారిని ఆదర్శవంతమైన మేల్కొలుపు మరియు నిద్ర షెడ్యూల్‌కు తగ్గించండి. దినచర్యలు పిల్లలకు స్థిరత్వ భావాన్ని అందిస్తాయి, ఇది వేసవి స్వేచ్ఛ నుండి పాఠశాల నిర్మాణానికి మారుతున్న సమయంలో చాలా ముఖ్యమైనది. పళ్ళు తోముకోవడం, ఉదయం చదువుకునే సమయం మరియు అల్పాహారం తినడం వంటి ఉదయం చెక్‌లిస్ట్‌ను షెడ్యూల్ చేసిన సమయంలో సృష్టించడం అలవాట్లను పెంచుకోవడంలో సహాయపడుతుంది. పిల్లలు అంచనా వేయగల సామర్థ్యంతో వృద్ధి చెందుతున్నందున స్థిరత్వం ఆందోళనను తగ్గిస్తుంది. మెదడు విశ్రాంతి తీసుకోవడానికి సమయం ఆసన్నమైందని సూచించడానికి కలిసి చదవడం వంటి ప్రశాంతమైన సాయంత్రం దినచర్యను చేర్చండి. మొదటి రోజు నాటికి, మీ పిల్లల శరీర గడియారం పాఠశాలకు సిద్ధంగా ఉంటుంది.

**ఇది ఆరోగ్యంగా తినడానికి సమయం**

మాపుల్ సిరప్ తో నిండిన ఆ పాన్కేక్ లన్నీ మానేయాలి. అప్పుడప్పుడు తినడం పర్వాలేదు, కానీ మీ పిల్లలకు పోషకమైన మరియు సమతుల్య ఆహారం ఇవ్వడం ప్రారంభించడం ముఖ్యం. పోషకాహారం మరియు వ్యాయామం నేరుగా విద్యా పనితీరుపై ప్రభావం చూపుతాయి. వారికి తృణధాన్యాలు, ప్రోటీన్ మరియు పండ్లు వంటి పోషకమైన ఆహారాలను ఇవ్వండి. బెర్రీలు లేదా పెరుగు పార్ఫైట్లతో ఓట్ మీల్ వంటి శీఘ్ర, పోషకమైన అల్పాహారాలను ప్లాన్ చేయండి. శక్తిని నిలబెట్టడానికి భోజనం కూరగాయలు, లీన్ ప్రోటీన్లు మరియు సంక్లిష్ట




కార్బోహైడ్రేట్ల మిశ్రమం కావచ్చు. చక్కెర కలిగిన స్నాక్స్ పరిమితం చేయండి, ఇది శక్తి నష్టాలకు కారణమవుతుంది. క్రీడలు, సైక్లింగ్ లేదా నడక ద్వారా కనీసం 60 నిమిషాల రోజువారీ శారీరక శ్రమను ప్రోత్సహించండి. వ్యాయామం మానసిక స్థితి మరియు దృష్టిని పెంచుతుంది, ఇది మంచి జ్ఞాపకశక్తి నిలుపుదలకు దారితీస్తుంది. పాఠశాల సంవత్సరం ప్రారంభంలోనే ఈ అలవాట్లను ఏర్పరచుకోండి.

**కమ్యూనికేట్ చేయండి**

తిరిగి పాఠశాలకు వెళ్లే సీజన్ కొత్త ఉపాధ్యాయుల గురించి, కఠినమైన సబ్జెక్టుల గురించి లేదా సామాజిక గతిశీలత గురించి ఆందోళనను రేకెత్తిస్తుంది. కాబట్టి, మీ పిల్లలతో వారి ఆలోచనల గురించి మాట్లాడటం చాలా ముఖ్యం. మీ పిల్లలు తమ భావాలను పంచుకోవడానికి సురక్షితమైన స్థలాన్ని సృష్టించండి. "మీరు దేని గురించి ఉత్సాహంగా లేదా ఆందోళన చెందుతున్నారు?" వంటి ఓపెన్-ఎండ్ ప్రశ్నలను అడగండి. పరిష్కారాల వైపు దూకకుండా చురుకుగా వినండి. వాస్తవిక విద్యా మరియు సామాజిక లక్ష్యాలను చర్చించండి, పరిపూర్ణత కంటే ప్రయత్నాన్ని నొక్కి చెప్పండి. చిన్న పిల్లలకు, కొత్త క్లాస్‌మేట్‌కు తమను తాము పరిచయం చేసుకోవడం వంటి రోల్-ప్లే దృశ్యాలు. టీనేజర్ల కోసం, సమయ నిర్వహణ లేదా తోటివారి ఒత్తిడి గురించి మాట్లాడండి.

**వారి అధ్యయన స్థలాన్ని ఏర్పాటు చేయండి**

వారి అధ్యయన గదిని పునర్వ్యవస్థీకరించాల్సిన సమయం ఇది. ఇంట్లో నిశ్శబ్దంగా, చిందరవందరగా లేని అధ్యయన ప్రాంతాన్ని ఏర్పాటు చేయండి. పాఠశాల సరఫరా జాబితాను చూసి, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బరులు, నోట్‌బుక్‌లు, కాలిక్యులేటర్, రూలర్లు మరియు సబ్జెక్టుకు సంబంధించిన సామగ్రిని చేర్చండి. సామాగ్రిని చక్కగా మరియు అందుబాటులో ఉంచడానికి పెన్సిల్ హోల్డర్లు, ట్రేలు లేదా చిన్న డ్రాయర్‌ల వంటి ఆర్గనైజర్‌లను ఉపయోగించండి. గదిలో మంచి లైటింగ్ మరియు తక్కువ అంతరాయాలు ఉన్నాయని నిర్ధారించుకోండి. అంకితమైన అభ్యాస స్థలం మొదటి రోజు నుండే దృష్టి మరియు క్రమశిక్షణను ప్రోత్సహిస్తుంది.

**మీ పిల్లల విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోండి**

వేసవిలో సుదీర్ఘ విరామం తర్వాత, వారిని తిరిగి విద్యారంగంలో పెట్టుబడి పెట్టడానికి సమయం కేటాయించడం చాలా ముఖ్యం. వేసవిలో నేర్చుకోవడంలో నష్టం నిజమైనది. సరదాగా, తక్కువ ఒత్తిడితో కూడిన కార్యకలాపాలతో పిల్లలను తిరిగి విద్యారంగంలోకి తీసుకురావడానికి వీలు కల్పించండి. చిన్న పిల్లల కోసం, ప్రతిరోజూ కలిసి చదవండి లేదా లెక్కింపు మార్పు వంటి గణిత ఆటలు ఆడండి. పెద్ద పిల్లల కోసం, త్వరిత రిఫ్రెషర్‌ల కోసం ఆన్‌లైన్ వనరులను ప్రయత్నించండి. వారానికి ఒక పుస్తకం చదవడం లేదా గుణకార పట్టికలను నేర్చుకోవడం వంటి నిర్దిష్ట, సాధించగల లక్ష్యాలను కలిసి నిర్దేశించుకోండి. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి చిన్న విజయాలను జరుపుకునేలా చూసుకోండి.

విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 02 జూన్, 2026



www.viswamvoice.com

# పొగాకు వినియోగం ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు

**పొగాకు మానేద్దాం - ఆరోగ్యాన్ని గెలుద్దాం**

**ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ : డాక్టర్ ఎన్.వసుంధర**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి బొమ్మూరు జంక్షన్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసుంధర, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ, పొగాకు వినియోగం ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారిందన్నారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, పాన్ మసాలా తదితర పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక ప్రాణాంతక సమస్యలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకుని పొగాకు ఉత్పత్తులకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు వినియోగాన్ని నిరోధించడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు. పొగాకు మానేద్దాం - ఆరోగ్యాన్ని గెలుద్దాం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరి చేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ టీం నోడల్ అధికారి, సీఐ పి.వి.సూర్య మోహన్‌రావు మాట్లాడుతూ పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పొగాకు వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. యువత మాదక ద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ధూమపానం కారణంగా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. దేశంలో పొగాకు వినియోగం కారణంగా సంభవిస్తున్న మరణాల శాతం ఆందోళనకరంగా ఉందన్నారు. ముఖ్యంగా 15 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల యువతలో పొగాకు వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. సిగరెట్ పొగలో వేలాది హానికర రసాయనాలు ఉండి అవి నోరు, గొంతు, ఊపిరితిత్తులు, జీర్ణాశయం తదితర అవయవాల క్యాన్సర్‌కు కారణమవుతున్నాయని వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం, విద్యాసంస్థలు మరియు ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమం సోషల్ వర్కర్ ఎం.అర్జున్‌రావు మాట్లాడుతూ ధూమపానం మాత్రమే కాకుండా పాసివ్ స్మోకింగ్ కూడా తీవ్ర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని చెప్పారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, చిన్నారులు పొగాకు పొగ ప్రభావానికి గురైతే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. పొగాకు వినియోగ నిర్మూలన కోసం ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, ఈగల్ టీం సీఐ పి.వి. సూర్యమోహన్ రావు, ఎస్ఐ నరేష్ కుమార్, డెమో అధికారి సత్యవతి, ఎపిడిమియాలజిస్ట్ సుదీర్ బాబు, సైకాలజిస్ట్ రాజు, జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమం సోషల్ వర్కర్ ఎం. అర్జున్ రావు, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది, పోలీసు సిబ్బంది, బ్రహ్మకుమారి సమితి సభ్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులకు ఆప్యాయతగా

# సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** వృద్ధాప్యంలో వృద్ధులు వారి కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా స్వశక్తితో నిలబడాలనుకునే వారికి సామాజిక పింఛన్‌లు వారిలో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నాయని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం జూన్ ఒకటవ తేదీ సందర్భంగా వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు సామాజిక భరోసా పింఛన్లు ఆయన చేతుల మీదుగా అందజేశారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో తెల్లవారుజామునే పింఛన్ దార్ల ఇళ్లకు వెళ్లి ఆప్యాయతగా పలకరిస్తూ, యోగక్షేమాలు అడిగి పింఛన్లు అందజేశారు. దీంతో వృద్ధుల మోకాల్లో చిరునవ్వులు చిందిస్తూ, బత్తులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, మార్ని రాము, అడ్డాల శ్రీను, మేడిశెట్టి శివరాం, అడపా శ్రీనివాస్, మార్ని బుజ్జి, ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ నిబంధనలకు

# వ్యతిరేకంగా పాఠ్య పుస్తకాలు అమ్మకాలు



**కార్పొరేట్ కళాశాలలో దారుణంగా ఫీజులు వసూళ్ళు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలపైన చర్యలు తీసుకోవాలని సోమవారం ఉదయం ఎస్ఎఫ్ఐ తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్.ఐ.ఓ శారదకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తూర్పు గోదావరి జిల్లా కమిటీ సభ్యులు కె.జ్యోతి, జి.కార్తీక్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో అనేక ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో దారుణంగా వేలకి వేలు ఫీజులు వసూళ్ళు చేస్తున్నారన్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ వంటివి అమ్ముతూ వీటి పేరుతో వేలకి వెలు ఫీజులు వసూలు చేసే పని చేస్తున్నారు. అలాగే కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా, గ్రౌండ్, ఫైర్ సేఫ్టీ వంటి కనీస వసతులు మౌలిక సౌకర్యాలు కూడా లేకుండా కళాశాలలు నడుపుతున్నారు. కాబట్టి జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు పై తనిఖీలు జరిపి ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు పి.తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### నెలపర్తిపాడు గణపతి నగర్

# పంట బోదిని వెంటనే పునరుద్ధరించాలి



**ఆర్డీవోకు రైతుల వినతి**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గ్రామం గణపతి నగర్ ప్రాంతంలో పూర్వ కాలం నుండి కొనసాగుతున్న పంట బోదిని వెంటనే పునరుద్ధరించి సాగునీటి సరఫరా ను పునఃప్రారంభించాలని స్థానిక చిన్న, సన్న కారు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులు రామచంద్రపురం ఆర్డీవో సరళావతికి వినతిపత్రం అందజేశారు. గణపతి నగర్ నుండి మెల్ల సుబ్బరాజు వారి పొలం సరిహద్దు వరకు సుమారు 500 మీటర్ల మేర ఉన్న ఈ పంట బోది ద్వారా దశాబ్దాలుగా వ్యవసాయ భూములకు సాగునీరు అందుతోంది. అయితే, ఇటీవల ఈ బోదిని ఆక్రమించి మూసివేయడంతో సుమారు 15 మంది చిన్న, సన్నకారు రైతుల భూములు సాగునీరు అందక బీడువారే పరిస్థితి నెలకొంది. పంటలను కాపాడుకోవడానికి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పూర్వపు రివాజు ప్రకారం తమకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకున్నారు. రైతుల సమస్యపై స్పందించిన ఆర్డీవో సరళావతి సమస్యను పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, చింతా రాజారెడ్డిలతో పాటు చిన్న, సన్నకారు రైతులు బొక్క శ్యామల రాజు, టేకుమూడి సత్యనారాయణ, పైడిమళ్ళ సత్యనారాయణ, పలివెల అబ్రహం, మెల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్నినోపై గ్రామాల్లో

# రైతులకు అవగాహన కల్పించాలి



**రాజమహేంద్రవరం, నేటి వార్త :** ఎల్నినోపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి అని, ఎల్నినో ప్రభావంపై వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ ఆందోళన వ్యక్తపరిచిన నేపథ్యంలో ఖరీఫ్‌లో రైతులు నష్టపోకుండా ప్రణాళికలు సిద్ధం చేసి వారికి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. చెరువులు కాలువలు సాగునీటి నిర్వహణ మొదలగు వాటిపై అధికారులు ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకుని రైతులకు ప్రయోజనకరంగా ఉండే విధంగా వ్యవహరించాలని కోరారు. "పంట ప్రణాళికలో జాగ్రత్త - నీటి నిర్వహణలో ముందుచూపు" తో రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఏకీకృత మార్గదర్శకాలను విడుదల చేయాలి. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక నీటి పొదుపు పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలి అని కోరడం జరిగింది. ధవలేశ్వరం ప్రాంతంలో గోపాద రేవు పరిసర ప్రాంతాలలో నదీ జలాల కాలుష్యాన్ని అరికట్టాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణంరాజు, రజని జనతా వారధి కో కన్వీనర్ లు యానాపు ఏసు సత్య ప్రసాద్, సూర్యకిరణ్, బిజెపి నాయకులు షేక్ షాహిద్. కొండలరావు,లక్ష్మీ సంతోషి, ఒంటెద్దు స్వామి, మీనాక్షి బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# లబ్దిదారుల ఇంటి ముంగిటకే పింఛన్లు అందచేత : కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం నుంచే నిర్దిష్టంగా ప్రారంభమైందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరం నగరంలోని 41వ వార్డు ఆవా బాంబే కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి స్వయంగా పర్యవేక్షించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా వారి చేతుల్లోకి పింఛన్ నగదును కలెక్టర్ కీర్తి చేకూరి అందజేశారు.పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్, పింఛన్ సాయం వారికి ఏ విధంగా ఉపయోగపడుతోందో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందని వెల్లడించారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆర్థిక భరోసా కల్పించడంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులు తమ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మొదటి రోజే శతశాతం పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సాయంత్రానికల్లాపారదర్శకంగా, ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా పంపిణీ పూర్తి చేయాలని పేర్కొన్నారు. పింఛన్ పంపిణీకి సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికితీసుకురావాలని, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు.పింఛన్ లబ్ధిదారులు సీతా నాగదేవి (దివ్యాంగుల పింఛన్), శ్రీ ఎస్. సన్యాసిరావు (మెడికల్ పింఛన్) ఇంటి వద్దకే అధికారులు వచ్చి పింఛన్ అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా పింఛన్ అందడం తమకు ఎంతో భరోసానిస్తోందని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇంటి ముంగిటకే పింఛన్ అందించడం ద్వారా ప్రభుత్వం మానవీయ పరిపాలన అందిస్తోందని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ బి. నాగేష్, ఆర్ఎంసీ కార్యదర్శి శైలజవల్లి, మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అమలాపురంలో డీఎస్సీ అక్రమాలపై


# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ప్రక్రియలో చోటుచేసుకున్న అవకతవకలు, అక్రమాలు మరియు పారదర్శకత లోపాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈరోజు భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ చేపట్టిన ఈ నిరసనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలు, యువజన మరియు విద్యార్థి విభాగ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నిరసన అనంతరం పార్టీ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు మరియు నిరుద్యోగ యువతకు జిల్లా యువజన విభాగం ధన్యవాదాలు తెలియజేసింది. అర్హత మరియు ప్రతిభకు న్యాయం జరిగే వరకు నిరుద్యోగ యువత హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు, రామచంద్రాపురం నియోజకవర్గం ఇంచార్జి పిల్లి సూర్య ప్రకాష్ స్పష్టం చేశారు.

### పెన్షనర్లుకి పెన్షన్ ఇచ్చి వారి ఫోటోలు తీసుకొని గ్రూపుల్లో

# షేర్ చేయడం అనేది పెన్షనర్లుకి ఇబ్బంది



**నేనుసైతం టీం**


**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ వారు పెన్షనర్లుకి పెన్షన్ ఇచ్చి వారి ఫోటోలు తీసుకొని గ్రూపుల్లో షేర్ చేయడం అనేది పెన్షనర్లుకి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది, పెన్షన్ అనేది సచివాలయ సిబ్బంది వారు వెళ్లి ఇవ్వాలి, కానీ రాజకీయ నాయకులూ గ్రూపులుగా వెళ్లి ఫోటోలు తీసుకుంటున్నారు, ఈ విధమైన ధోరణి (పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటం) సామెతలా వుంది. పెన్షనర్లు చాలా ఇబ్బందిగా బాధపడుతున్నారు, ఆలా అని పెన్షన్ తీసుకోకపోతే వారి జీవనం కొనసాగడం కష్టం, మాది మంచి ప్రభుత్వం అని చెప్పుకునే ఈ కూటమి ప్రభుత్వనికి ఈ విషయం ఎందుకు తెలియడం లేదో అర్ధం కావడం లేదు.నారాచంద్ర బాబు నాయుడు ఈ విషయం పై ద్రుష్టి సారించి, ఈ విధానానికి స్వస్తి పలుకుతారని ఆశిస్తూ నేనుసైతం టీం కుడిపూడి విష్ణు మూర్తి.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజల నుంచి వినతిపత్రాలు, అర్జీలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ, భూ సంబంధిత మరియు ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని మంత్రి క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం కలుగుతోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమానికి పెద్దపీట

## రికార్డు స్థాయిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదలు, వృద్ధులు, వితంతువులు మరియు దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ రికార్డు స్థాయిలో పింఛన్లు అంద జేస్తోంది. రామచంద్రపురంలో జరిగిన జూన్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నెల పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.2,728 కోట్లను విడుదల చేసిందని రాష్ట్రవ్యాప్తంగా 62,34,445 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛన్లు అందించేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. కొత్తగా 5,606 మందికి 'స్పౌజ్' కేటగిరీ కింద వితంతు పింఛన్లను మంజూరు చేశామని ఇందుకోసం అదనంగా రూ.2.24 కోట్లను కేటాయించామని మంత్రి వివరించారు. పింఛన్ పొందుతున్న లబ్ధిదారుడు మరణిస్తే వారి జీవిత భాగస్వామికి అదే నెల నుండి పింఛన్ అందేలా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమం మరియు అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తోందని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం రికార్డు స్థాయిలో రూ.65,886 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని మంత్రి సుభాష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బాలయోగి స్టేడియంలో ఘనంగా విలు విద్య శిక్షణ తరగతులు

## యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం : ఆర్చరీ కోచ్ దేశంశెట్టి సాయిబాబు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలోని జి.ఎం.సి. బాలయోగి స్టేడియంలో సాయి ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో విలువిద్య (ఆర్చరీ) శిక్షణ తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ ఆర్చరీ కోచ్ దేశంశెట్టి సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమానికి విద్యార్థులు, క్రీడాకారులు విశేష స్పందన వ్యక్తం చేశారు. జిల్లాలో విలువిద్య క్రీడను ప్రోత్సహించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సాయిబాబు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు క్రమశిక్షణ, ఏకాగ్రత, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించే క్రీడల్లో విలువిద్యకు ప్రత్యేక స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు. డి.ఎస్.డి.ఓ రుద్ర ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, బాలయోగి స్టేడియంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్న కోచ్ దేశంశెట్టి సాయిబాబును అభినందించారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోచ్ దేశంశెట్టి సాయిబాబు మాట్లాడుతూ విలువిద్య భారతదేశానికి గొప్ప గుర్తింపు తీసుకొచ్చిన క్రీడల్లో ఒకటని తెలిపారు. సరైన శిక్షణ, కృషి, పట్టుదల ఉంటే గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. అమలాపురం ప్రాంతంలో ఆర్చరీ క్రీడపై ఆసక్తి పెరుగుతుండటం సంతోషకరమని, ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించేందుకు సాయి ఆర్చరీ అకాడమీ కట్టుబడి ఉందని వెల్లడించారు. విలు విద్య కేవలం ఒక క్రీడ మాత్రమే కాకుండా ఏకాగ్రత, లక్ష్యసాధన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సాధనమని ఆయన వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని సాధించవచ్చని సూచించారు. శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో డి.ఎస్.ఎ. తైక్వాండో కోచ్, డి.ఎస్.ఎ. సత్యం, వెంకట్, డి.ఎస్.ఎ. రాజేష్, జి.ఎం.సి. బాలయోగి స్టేడియం ఇన్‌చార్జ్ భీమేష్, వాగ్దేవి స్కూల్ పీటీ రాయి రాజేష్, తిక్కరెడ్డి శ్రీను తదితరులు పాల్గొని కోచ్ దేశంశెట్టి సాయిబాబు చేస్తున్న కృషిని అభినందించారు. ప్రస్తుతం బాలయోగి స్టేడియంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు మంచి స్పందన లభిస్తుండగా, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను తీర్చిదిద్ది కోనసీమ జిల్లాకు క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో సాయి ఆర్చరీ అకాడమీ ముందుకు సాగుతోంది. విలువిద్యలో ఆసక్తి ఉన్న బాలబాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

### ఆత్మీయ పలకరింపుతో లబ్ధిదారులకు

# పెన్షన్లు అందించిన కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** "ఆత్మీయ పలకరింపుతో పేదల సేవలో" పేరిట ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం అమలాపురం గ్రామీణ మండల పరిధిలోని రావులచెరువు, జనుపల్లి గ్రామపంచాయతీల్లో నిర్వహించిన సామాజిక భద్రత, వికలాంగుల పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,96,669 మంది లబ్ధిదారులకు రూ.83.97 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే కొత్తగా 261 సామాజిక భద్రతా పెన్షన్లు, 39 ఆరోగ్య భద్రతా పెన్షన్లు, 222 వితంతు పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ సోమవారం జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగిందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరించి పెన్షన్లు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాల సంక్షేమం కోసం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి నెలా సమయానికి పెన్షన్లు అందించడం ద్వారా వారి జీవనోపాధికి, సామాజిక భద్రతకు భరోసా కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,96,669 మంది లబ్ధిదారులకు రూ.83.97 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు పరిధిలో ఇంటి వద్దకే పెన్షన్లు అందించడం వల్ల లబ్ధిదారులు సౌకర్యవంతంగా సేవలు పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా, అవినీతి రహితంగా అమలయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డి.రాంబాబు, డీపీఎం అన్నపూర్ణ, డిప్యూటీ ఎంపీడీవో శాస్త్రి, గ్రామ సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం రైల్వే జోన్ అమలు హర్షణీయం



### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం రైల్వే జోన్‌ను నేటి నుంచి అధికారికంగా అమలులోకి తీసుకురావడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం అమలాపురంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలలో రైల్వే జోన్ అంశాన్ని పరిశీలిస్తామని మాత్రమే గతంలో ప్రకటించిన బీజేపీ, నేడు దానిని సుసాధ్యం చేస్తూ విశాఖపట్నం రైల్వే జోన్‌ను ప్రకటించి అమలు చేయడం ఆనందకర విషయమన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంతానికి సంబంధించిన నిర్ణయాలు వేగవంతంగా తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి ప్రధాన నౌకాశ్రయాలకు రైల్వే అనుసంధానాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు పెరుగుతాయని చెప్పారు. రైల్వే జోన్ వల్ల సుమారు 65 వేల మందికి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, పోర్టులకు అనుసంధానమైన రైల్వే మార్గాలను అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. దీని ద్వారా ఎగుమతులు, దిగుమతులు మరింత పెరిగి వ్యాపారాభివృద్ధికి ఊతమిస్తుందని అన్నారు. అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, కొత్త మార్గాలను అభివృద్ధి చేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సంఖ్యను పెంచడం వంటి అంశాలు రైల్వే జోన్ ద్వారా సాధ్యమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రైల్వే జోన్ అమలుకు కృషి చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిగా పనిచేస్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, ఎన్డీయే నాయకత్వానికి నల్లా పవన్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

### కొత్తపేట బాయ్స్ హైస్కూల్లో బాస్కెట్ బాల్ కోచింగ్

# వేసవి ఉచిత శిక్షణ శిబిరం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేటకు బాస్కెట్ బాల్ క్రీడకు ప్రత్యేక అనుబం ధం రావులపాలెం, కొత్తపేటల్లో నూతనంగా బాస్కెట్ బాల్ కోర్టులు నిర్మిస్తాం విద్యార్థు లకు చదువుతోపాటు క్రీడలు అవసరమే కొత్తపేట బాయ్స్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన బాస్కెట్బాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపులో ఎమ్మెల్యే బండారు కొత్తపేట బాయ్స్ హైస్కూల్లో బాస్కెట్బాల్ కోచింగ్ వేసవి ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందించదగ్గ విషయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మందికి పైగా చిన్నారులు ఈ బాస్కెట్బాల్ శిక్షణ ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వారందరినీ అభినందిస్తున్నట్లు తెలిపారు. కొత్తపేటకు బాస్కెట్ బాల్‌కు ప్రత్యేక అనుబంధం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్తపేటలో బాస్కెట్ బాల్ పోటీలు అధికంగా జరిగేవని, ప్రేక్షకులు తరలివచ్చి వీక్షించేవారని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.విద్యార్థి దశలో క్రీడలు, చదువు రెండింటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలు, వ్యాయామం పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయన్నారు. విద్యార్థులు ఒక్కొక్కరిలో ఒక్కొక్క నైపుణ్యం ఉంటుందని వాటిని బయటికి తీసి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడం వల్ల దేశస్థాయిలో రాణించవచ్చన్నారు. దానికి ఉదాహరణ అమలాపురానికి చెందిన రంకిరెడ్డి సాయి సాత్విక్ అన్నారు. బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించిన గనిరాజు, గాంధీ, కోచ్ లను అభినందించారు. కొత్తపేట, రావులపాలెం లలో రెండు బాస్కెట్ బాల్ కొత్త కోర్టుల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.

### గుబ్బల చంద్రరావు మృతికి రామచంద్రపురం నియోజకవర్గ

# వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ పరామర్శ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గుబ్బలవారిపేట గ్రామానికి చెందిన గుబ్బల చంద్రరావు కన్నుమూశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ పరామర్శించారు. వారి మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గుబ్బలవారిపేట గ్రామ పెద్దలు పాల్గొని, మృతుని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

### 10వ తరగతి మెరిట్ విద్యార్థులకు

# ఎమ్మెల్యే బండారు చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లు

### కుల సంఘాల ద్వారా సామాజిక అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేటలోని కాపు కళ్యాణ మండపంలో కాపు ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి కుల సంఘాలు సానుకూల పాత్ర పోషించాలని, విద్య, ఉపాధి, సామాజిక సేవల వంటి అంశాల్లో ముందుండి సేవలు అందించడం మంచి పరిణామమని అన్నారు. కుల సంఘాల ఏర్పాటు అనేది ఇతర కులాలకు వ్యతిరేకం కాదని, తమ వర్గ అభివృద్ధి కోసం సమష్టిగా పనిచేసే వేదికగా వాటిని చూడాలని సూచించారు. సమాజంలో ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువతకు స్ఫూర్తి కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**12 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు – ఎమ్మెల్యే సహకారంతో పెరిగిన ఆర్థిక ప్రోత్సాహం**

10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థిని, విద్యార్థులను సభ వేదికపై ఘనంగా సత్కరించారు. వారికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లు అందజేశారు.వాస్తవానికి ఒక్కో విద్యార్థికి రూ.3,500 చొప్పున అందించాలని కాపు ఉద్యోగ సంఘం నిర్ణయించగా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఒక్కో విద్యార్థికి రూ.5,000 చొప్పున అందించాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన అదనపు రూ.1,500ను ప్రతి విద్యార్థికి తన సొంత నిధుల నుంచి అందజేసినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే చూపిన ఈ ఉదారతకు సంఘ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**పదోన్నతులు పొందిన ఉద్యోగులు, డీఎస్సీ విజేతలకు ఘన సత్కారం**

ఈ సందర్భంగా ఉద్యోగ జీవితంలో పదోన్నతులు పొందిన పలువురు ఉద్యోగులను, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన యువతను, ఇటీవల పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి వారి సేవలను కొనియాడారు.వచ్చే ఏడాది మరింత భారీ స్థాయిలో కార్యక్రమం నిర్వహించాలి. సత్కార గ్రహీతలను అభినందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో ముందుకు సాగేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో నిర్వహించి, ఎక్కువ మంది విద్యార్థులు మరియు ప్రతిభావంతులను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులకు సూచించారు.

**ఎమ్మెల్యేకు సంఘం నాయకుల కృతజ్ఞతలు**

కార్యక్రమంలో మాట్లాడిన కాపు ఉద్యోగ సంఘం నాయకులు, విద్యార్థుల కోసం అదనపు ఆర్థిక సహాయం అందించి స్కాలర్‌షిప్ మొత్తాన్ని పెంచిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావుని సత్కరించారు. విద్యాభివృద్ధి కోసం ఆయన చూపుతున్న చొరవ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాపు ఉద్యోగ సంఘం నాయకులు, సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్షన్ జీవన మనుగడకు భరోసా : గుబ్బల మూర్తి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదల పాలిట అభయ నేస్తం ఎన్టీఆర్ సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి పేద ప్రజల పాలిట అభయ నేస్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం నిలుస్తుందని సీనియార్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి అన్నారు.ప్రతినెలా అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో భాగంగా ఒకటవ తేదీ కొత్తపేట మూడో వార్డులో కమ్మిరెడ్డి పాలెం నివాసిత పెన్షన్ దారులకు సచివాలయం సిబ్బందితో కలిసి గుబ్బల మూర్తి పెన్షన్ డబ్బులు అందించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రమం తప్పకుండా పెన్షన్ దారులకు తెల్లవారుజాము నుంచి పెన్షన్ అందిస్తుందని గుబ్బల మూర్తి తెలిపారు.వృద్ధులు వికలాంగులు వితంతువులకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ జీవన మనుగడకు భరోసా ఇస్తుందని గుబ్బల మూర్తి పేర్కొన్నారు.కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపుమేరకు పెన్షన్ కంపెనీలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

### మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

# మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంఠంశెట్టి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవత్వం చాటుకున్న కొత్తపేట మార్కెట్ వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా కొత్తపేట మార్కెట్ వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు వ్యవహరించారు. కేదార్లంక గ్రామానికి చెందిన వ్యక్తి బోడుపాలెం మెయిన్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో రోడ్డుపైనే కుప్పకూలిపోయాడు.అదే సమయంలో అటుగా వెళ్తున్న శ్రీనివాసరావు వెంటనే తన వాహనాన్ని ఆపి, అక్కడున్న స్థానికుల సహకారంతో బాధితుడిని హుటాహుటిన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో బాధితుడికి చికిత్స అందింది.అత్యవసర పరిస్థితిలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించిన శ్రీనివాసరావు మానవత్వాన్ని చాటుకున్నారని స్థానికులు ప్రశంసించారు. ఆయన చూపిన చొరవ, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని చుట్టుపక్కల ప్రజలు అభినందనలు తెలిపారు.

# బాధితుల సమస్యలకు సత్వర న్యాయమే మా ప్రాధాన్యత



### జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, (అడ్మిన్) ఏ.వి.ఆర్.పీ.బీ. ప్రసాద్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో (సోమవారం) జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ (అడ్మిన్) ఏ.వి.ఆర్.పీ.బీ. ప్రసాద్ స్వయంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ (అడ్మిన్) ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను ఓపికగా విని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. సోమవారం కార్యక్రమంలో మొత్తం 24 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నాయి. అందిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎస్పీ (అడ్మిన్) అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును అత్యంత పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ (అడ్మిన్) బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ (అడ్మిన్) ఏ.వి.ఆర్.పీ.బీ. ప్రసాద్, డీపీఓ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ
జిల్లా ఎడిషన్
మంగళవారం, 02 జూన్ 2026
www.viswamvoice.com


# కొబ్బరి చెట్లను పంచాయతీ దాఖలు చేసుకోవాలి...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంచాలక శాఖకు 1960 వ దశకంలో ధఖలుపడి నేటికీ ఆ శాఖ యాజమాన్యంలోనే ఉన్న, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరం గ్రామ కంఠం 124 సర్వే నెంబర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాత ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలోని 53 కొబ్బరి చెట్లూ తరచుగా వివాదానికి నేపథ్య కారణం అవుతూనే ఉన్నాయి. ఇందుకు ఆస్పత్రి పాత భవనాలను తొలగించి ఖాళీగా ఉన్న ఈ ప్రాంగణంలోని కొబ్బరి చెట్ల ఫలసాయం కాస్తా 66 ఏళ్లుగా అన్యులకు అన్యాక్రాంతమౌతూ అనాధ ఆస్తిగా ఉండడమే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలోనే ఈ కొబ్బరి చెట్లను పంచాయతీ దఖలు చేసుకోవాలని సామాజిక సేవాకర్త మేకల కృష్ణ, ఆయన బృందం సభ్యులు మాజీ సర్పంచ్ పగడాల మెహన సన్యాసిరావు, పర్వత రామకృష్ణ, రేలంగి వెంకట సత్యనారాయణ, బొమ్మిడి సత్యనారాయణ తదితరులు కోరుతూ ఉన్నారు. ఈ మేరకు వారు పంచాయతీ కార్యదర్శి కూసిరెడ్డి అప్పలరాజు, డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మికి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఈ భూమిలోని 53 కొబ్బరిచెట్ల ఫలసాయం 1960 దశకం నుంచి కొందరు ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళుతున్న వైనంపై తగు దర్యాప్తు జరిపి తగు చర్యలను తీసుకుని, తక్షణం కొబ్బరి చెట్లను బహిరంగ వేలం వేసి, సదరు ఆదాయాన్ని పంచాయతీ బ్యాంక్ ఖాతాకు జమ చేయాలని కోరారు. ఈ 53 కొబ్బరి చెట్లకూ ఏటేటా సుమారు రూ. 1,00,000ల వరకూ ఆదాయం సమకూరే విషయమై 66 ఏళ్లుగా పంచాయతీ కొనసాగిస్తున్న ఉదాసీనతను వారు ఆక్షేపించారు. పంచాయతీకి దఖలు కావాల్సిన ఈ ఆదాయం కాస్తా ప్రైవేట్ వ్యక్తుల పరం కావడంపై వారు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే పాత పంచాయతీ, పాత గ్రంధాలయం కార్యాలయాల ఆవరణల్లోనూ, అలాగే సగర చెరువు గట్టు నున్న కొబ్బరి చెట్ల కొబ్బరి కాయల అమ్మకానికి ఆదాయానికి ప్రతీ మూడేళ్లకూ ఒక సారి బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లే పాత ఆస్పత్రి ప్రాంగణంలోని కొబ్బరి చెట్ల కొబ్బరి కాయల విక్రయానికి కూడా బహిరంగ వేలాన్ని నిర్వహించడం ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చు కోవాలని ఫిర్యాదీలు కోరారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కూసిరెడ్డి అప్పలరాజు ప్రతిస్పందిస్తూ పాత ఆస్పత్రి భూమి, కొబ్బరి చెట్లు పంచాయతీ ఆధీనంలో లేవని, సంబంధిత సమాచారం పంచాయతీ దస్త్రాల్లో అందుబాటులో లేదని ఫిర్యాదీలకు వివరణ ఇచ్చారు. అలాగే ఈ విషయం ఏ ప్రభుత్వ శాఖ పరిధిలో ఉందో విచారణ చేస్తామని, తదనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి వివరణ ఇచ్చారు.














# విజ్ఞాన, వినోదం కూడిన తరగతులు



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర గ్రంధాలయశాఖ సంచాలకులు ఎ.కృష్ణ మోహన్ వారి ఆదేశములతో, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో, గ్రంథ పాలకులు కవికొండల సత్యనారాయణ నేతృత్వంలో, సోమవారం వేసవి విజ్ఞన తరగతులు ప్రతిపాడు నియోజక వర్గం, ఏలేశ్వరం పట్టణంలోని స్థానిక శాఖాగ్రంధాలయంలో విజ్ఞానంతో కూడిన వినోదంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు మామిడి రాము విద్యార్థిని విద్యార్థులచే, కథలు చదివించుట మరియువ్రాయించుటజరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గురువుల యందు భక్తిని అలవర్చుకోవాలి అని అన్నారు. అంతేకాకుండా వారిచే పిల్లల మేధస్సును పెంచే ఆటలు ఆడించారు అనంతరం చిత్రలేఖనం తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది విద్యార్థిని,విద్యార్థులు మరియు పాఠకులు పాల్గొన్నారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులలో పాల్గొన్న విద్యార్థిని,విద్యార్థులకు, గ్రంథ పాలకులు కవికొండల సత్యనారాయణ బిస్కట్ పాకెట్లు, మరియు చల్లని పానీయాలు పంపిణీ చేయడం జరిగింది.

### పెద్దనాపల్లిలో లబ్ధిదారులకు

# పెన్షన్లు అందించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం మండలం, పెద్దనాపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి, వృద్ధాప్య, వితంతు,లకు 4 వేలు, విభిన్న ప్రతిభావంతులకు 6 వేలు చొప్పున లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ఖజానాలో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి వలన పెన్షనర్లకు, పెన్షన్ ఉద్యోగస్తులకు జీతాలు సకాలంలో అందుతున్నాయన్నారు. ప్రతి నెల 1వ తేదీ ఉదయం 10గంటల లో గ్రామాలలో ఈ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ పూర్తిచేసే దశగా అధికారులు పనిచేస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకర సత్తిబాబు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాపులు లేకుంటే పవన్‌కు గుర్తింపు ఎక్కడ..?



**కుల ధ్రువీకరణ పత్రాన్ని ప్రకటించుకోవాలి**
**పవన్ కళ్యాణ్ మాటలకు చేతలకు పొంతన లేదు**
**మేడా శ్రీనివాస్ సూటి ప్రశ్నలు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రాలో కాపులు లేకుంటే పవన్‌కు గుర్తింపు ఎక్కడ..?కులాల మధ్య చిచ్చుకు ప్రధాన కారణం పవన్ అని, ఓడ మల్లన్న - బోడి మల్లన్న సామెతకు పవన్ కళ్యాణ్ 24 క్యారెట్స్ వంటి వారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఏద్దేవా చేసారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ ఏ నాయకుని వెంటపడని కుల సమస్య వివాదాలు ఒక్క పవన్ కళ్యాణ్ చుట్టూనే ఎప్పుడూ తిరుగుతుంటాయి. నేను కుల నాయకుని కాదు అంటూనే అనేక సమావేశాల్లో కులాలు కోసం మాట్లాడటం పవన్ కళ్యాణ్ ప్రత్యేకతగా నిలుస్తుంది. రాజమండ్రి విచ్చేసిన సందర్భంగా తన పార్టీ బిసి సమావేశం పెట్టి కాపు నాయకులను విమర్శించటం పవన్ కళ్యాణ్ కే చెల్లుతుంది. పవన్ కళ్యాణ్ రాజకీయ ఆరంగేట్ర ప్రస్థానం నుండి కాపు నేత పిల్లా వెంకటేశ్వరరావు ను ఉద్దేశిస్తు కాపులు మద్దత్తు ఎవరడిగారని పవన్ కళ్యాణ్ అప్పుడు ఘాటుగా స్పందించారు. సీనియర్ నేత ముద్రగడను, దాసరి రాము, అంబటి రాంబాబు ఇలా ఎంతో మంది కాపు నేతలను టార్గెట్ చేస్తు కాపుల మద్దత్తు తనకు వద్దు అన్నట్టుగా పవన్ కళ్యాణ్ అనేక సందర్భాల్లో హేళనగా మాట్లాడే వారు . 2019 - 2024 ఎన్నికల్లో కనీసం కాపు కుల బావం తోనైనా నాకు ఓట్లు వేసి గెలిపించండని ప్రాధేయ పడే ధోరణిలో విజ్ఞప్తి చేసుకున్న పవన్ కళ్యాణ్ నేడు ఆ ఘటనను మరిచి మాట్లాడటం దురదృష్టకరం . గతంలో గాజువాక , భీమవరంలో పోటి చేయటానికి కారణం ఎక్కువ శాతం కాపుల ఓటింగ్ ఉందనే కదా ! ఆ తరువాత మాజీ ఎమ్మెల్యే వర్మ త్యాగంతో పిఠాపురం లో పోటీచేసింది కాపు ఓటర్లు వున్నారనే కదా ! ఎన్నికల సమయంలో కాపులను ఓట్ల కోసం యాచించటం, తరువాత నేను కుల నాయకుడిని కాదు అని చెప్పుకోవటం పవన్ కళ్యాణ్ కు పరిపాటిగా మారింది. అనాదిగా కాపులు పవన్ కళ్యాణ్ వంటి నేతలను నమ్మి మోసపోతున్నారు. పవన్ కళ్యాణ్ వంటి కుహనాలు అంత కాపులేనా! అనే సందేహలు వెంటాడుతున్నాయి. కులాన్ని ప్రచార అస్త్రంగా చేసుకుని రాజకీయాలను ఆశించే వారు కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా ప్రకటించుకోవాలి. పవన్ కళ్యాణ్ కూడా తన కుల ధ్రువీకరణ పత్రాన్ని ఋజువు చేసుకోవాలి. పిఠాపురం కాపు ఓటర్ల ను యాచించిన పవన్ కళ్యాణ్ మరిచిపోయారా ! అని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చిన నుండి ఏ ఒక్క మాటైనా పోషించుకున్నారా ! చెప్పిన ప్రతి మాట అబద్దాలే కదా ! చివరికి కట్టప్ప పాత్రతో కూటమి సర్కార్‌లో రాజకీయ స్థానం సుస్థిర పరచుకున్నారు . చేగువీరా నుండి మొదలు పెట్టి భగతసింగ్, సుభాష్ చంద్రబోస్ దగ్గర ప్రస్తుతం ఆగారు. ఆఘోరాలను, పవన్ కళ్యాణ్ వంటి నిలకడ లేని వారికి అధిక ప్రాధాన్యత నిస్తు ప్రజల దృష్టి మళ్ళించే విధంగా ఆంధ్ర - తెలంగాణాలో కొన్ని కార్పొరేట్ మీడియా సంస్థలు కిరాయి వార్త కధనాలకు నిత్యం సిద్ధంగా వుంటు సామాజిక ఉన్మాదాన్ని ఈ రకమైన ఒక వర్గం మీడియా వీరిని ప్రోత్సహిస్తుంటారు. పవన్ కళ్యాణ్ కారణంగా ఆంధ్రరాష్ట్ర భవిష్యత్ భావితరాల అభ్యున్నతి కోలుకోలేని విధంగా నష్ట పోతుంది . పవన్ కళ్యాణ్ సొంత ప్రయోజనాలు కోసం తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నడు కనీసం ఉనికిని కూడా చాటలేదు. పవన్ కళ్యాణ్ పార్టీలో నిలకడ లేని నేత ఎవరైనా వున్నారంటే అది పవన్ కళ్యాణ్ మాత్రమే. ఆ పార్టీ కి బలం అభిమానులైతే బలహీనతలు పవన్ కళ్యాణ్ అని భావించాలి. ఒకే ఒక్క సినిమా కారణం కుల అభిమానంతో మాత్రమే అభిమానులు పవన్ కళ్యాణ్ వెంట నడుస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఎదుగుదలకు ఓడ మీద ఉన్నప్పుడు ఓడ మల్లయ్య ఓడ దిగిన వెంటనే బోడి మల్లయ్య అనే పాత సామెత నేడు పవన్ కళ్యాణ్ కు సరిపోతుందన్నారు . కాపుల ఓట్లు అక్కరలేదు అని ప్రకటించుకుంటున్న పవన్ కళ్యాణ్ గాజువాక , భీమవరం, పిఠాపురం లో కాకుండా పులివెందుల, కర్నూల్ నియోజకవర్గాల్లో ఎందుకు పోటి చేయలేక పోయారో కారణం చెప్పగలరా ! పవన్ కళ్యాణ్ రాజమండ్రి వచ్చి పొల్యూషన్ కు సంబంధించి తన శాఖ తప్పిదమే నని మరిచి పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ను ప్రశ్నించటం పలువురుని ఆశ్చర్యానికి గురించేసింది . తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లా కు మెరుగైన సేవలు అందిస్తు ప్రజల మన్ననలను పొందుతున్న ఆమెను సైతం కాస్త దురుసుగా మాట్లాడిన సందర్భం రాజమండ్రి ప్రజల హృదయాలను గాయపరిచింది . సీనియర్ నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి వారిని ఉద్దేశిస్తు కూడా అహంబావంతో మాట్లాడిన వైఖరి పలువురు బుచ్చయ్య చౌదరి అభిమానులను మనస్థాపానికి గురి చేసిన ఘటనలు బాహటంగా కనబడ్డాయి. కులాల మధ్య చిచ్చుకు ముమ్మాటికీ పవన్ కళ్యాణ్ వైఖరే కారణాలు అన్నారు. కాపులు మోసపోవటానికి, వారి రాజకీయ భవిష్యత్ ను నిర్వీర్యం చేయటానికి పవన్ కళ్యాణ్ ఒక పథకం ప్రకారం కొన్ని శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నారని గ్రహించి కుల రహితంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యామ్నాయ రాజకీయ మార్పుకు కాపు సోదరులు అండగా ఉమ్మడి కార్యాచరణకు నిలవాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపునిస్తున్నారు. ఈ సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ డివి రమణమూర్తి, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, దుడ్డే త్రినాద్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, కాకర ప్రసాద్, సుంకర వెంకట భాస్కర రంగారావు,చల్లా సాంబశివరావు, నున్న గణేష్, చల్లా అఖిల్, ఏడిద బాబులు, ఎస్ కే సుల్తాన్, ఎస్ కే జరినా, ఎస్ కే జగిరా, ఎమ్‌డి కురంబి, ఎస్‌కే సుభాని, నాగురి అన్నపూర్ణ, మాసా ప్రమీల, మాసా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
మంగళవారం, 02 జూన్ 2026
www.viswamvoice.com




# 'ఆర్ ప్లే' టూరిజం హబ్‌కు శ్రీకారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. 1వ డివిజన్ సైక్లోన్ కాలనీ సమీపంలోని గెయిల్ కార్యాలయం వెనుక ఉన్న కార్పొరేషన్ స్థలంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆర్ ప్లే' ప్రాజెక్టుకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. తొలి దశలో రూ.2 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులు ఆరు నెలల్లో పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ సంస్థ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. నగర ప్రజలకు... ముఖ్యంగా చిన్నారులకు వినోదంతో పాటు పర్యాటక ఆకర్షణలను అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు చెప్పారు. మొత్తం రూ.5.93 కోట్లతో మూడు దశల్లో అమలు చేయనున్న ఈ ప్రాజెక్టులో తొలి దశగా స్ప్లాష్ పూల్, ఆప్టికల్ ఇల్యూజన్ బ్లాక్, మిర్రర్ మేజ్, హాంటెడ్ హౌస్ వంటి నాలుగు ప్రత్యేక ఆకర్షణలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరం పేరును ప్రతిబింబించేలా 'ఆర్ ప్లే'గా నామకరణం చేసిన ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో నగరానికి ప్రత్యేక టూరిజం హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నగర ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్పొరేషన్ స్థలాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పక్కనే ఉన్న ప్రసాద్ ఆదిత్య మాల్ తరహాలో కుటుంబాలు, పిల్లలు వారాంతాల్లో ఆహ్లాదంగా గడిపే యాక్టివిటీ జోన్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విదేశాల్లో కనిపించే స్ప్లాష్ పూల్ తరహా వినోద సదుపాయాలు, ఆధునిక సాంకేతికతతో రూపొందించే ఆప్టికల్ ఇల్యూజన్స్, మిర్రర్ మేజ్, హాంటెడ్ హౌస్ వంటి ఆకర్షణలు సందర్శకులను అలరిస్తాయని పేర్కొన్నారు. అలాగే గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులతో అనుసంధానంగా రెండు బ్లాక్‌ల మధ్య ప్రత్యేక బ్రిడ్జిని నిర్మించే ప్రణాళిక ఉందన్నారు. హైదరాబాద్ గండిపేట ప్రాంతంలోని ఆకర్షణీయ బ్రిడ్జిలను తలపించేలా దీనిని రూపొందించి గోదావరి అందాలను వీక్షించే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయిన అనంతరం నిర్వహణ బాధ్యతలను కూడా అదే సంస్థకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నామని, దీని ద్వారా సదుపాయాల నాణ్యతను దీర్ఘకాలం కొనసాగించవచ్చని చెప్పారు. నగర అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే బ్యాడ్మింటన్ కోర్టులు, క్రీడా వసతులు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేసిన ఎమ్మెల్యే వాసు వీఎల్‌పురంలో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రెండో దశ పనులకు జూన్ రెండో వారంలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. రూ.11 కోట్లతో రెండో దశ, రూ.28 కోట్లతో తొలి దశ పనులు చేపట్టి మొత్తం రూ.40 కోట్ల వ్యయంతో అత్యాధునిక క్రీడా సముదాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాజమహేంద్రవరం నగరాన్ని అభివృద్ధి, పర్యాటకం, క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా సంకల్పబద్ధంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్యక్రమంలో కడలి రామకృష్ణ, స్థానిక నాయకులు మామిడి శ్రీను, యేసు, సలాది ఆనంద్, ఉప్పు సుబ్రహ్మణ్యం, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాద బాధితుడికి స్వల్ప వడ్డీకి

# దీర్ఘకాలిక ఋణం అందించండి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అగ్ని ప్రమాదం వల్ల సర్వం కోల్పోయిన వస్త్ర దుకాణం యజమానికి కూటమి ప్రభుత్వం స్వల్ప వడ్డీకి దీర్ఘకాలిక ఋణాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఒఇండస్ట్రీ రాష్ట్ర కన్వీనర్ నందెపు శ్రీనివాస్ కోరారు.గత నెల 29న రాజమండ్రి మెయిన్ రోడ్ లో టాప్స్ కార్నర్ అనే వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించిందన్నారు. వ్యాపారం వర్తకునికి వృత్తి అయినా పరోక్షంగా అమ్మకం పన్నులు, ఆదాయపన్నులు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చే వర్గమన్నారు. అలాంటి వర్తకవర్గం ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేయూత అవసరమని అన్నారు. ఇటువంటి ఆకస్మిక ఆపదలు సంభవించినప్పుడు ప్రభుత్వం స్వల్ప వడ్డీకి దీర్ఘకాలిక ఋణాన్ని అదించి వర్తక వర్గాన్ని ఆదుకోవలసిన అవసరం వుందని కోరారు.ఈ వినతిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చేయూతనివ్వాలని అన్నారు.

# సప్పా కథకు జాతీయ పురస్కారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి నగరానికి నాట్య రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని అందించిన విఖ్యాత నాట్య పండితుడు, పరిశోధకుడు , సంగీతం చిత్రలేఖనం లలో దిట్ట అయిన బహు కళావేత్త డాక్టర్,సప్పా దుర్గాప్రసాద్. ఇప్పటికే 30 గ్రంథాలు రచించి విఖ్యాతిగాంచారు. ఇటీవల ఆయన రచించిన గ్రంథాలకే కాక, కథలకు జాతీయ పురస్కారాలను అందుకోవడం విశేషం. గత సంవత్సరం' ప్రి వెడ్డింగ్ షూట్ 'కథకు జాతీయ పురస్కారం లభించింది. ఈ ఏడాది వాసా ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలలో డాక్టర్, సప్పా దుర్గాప్రసాద్ రచించిన "బొమ్మ గుండె ఆగింది " కథకు ప్రథమ బహుమతి లభించింది. సప్పా వారు సామాజిక అంశాలు నేపథ్యంలో కేవలం 12 కథలు మాత్రమే రచిస్తే ఇప్పటికీ రెండు కథలు జాతియ పురస్కారాలు అందుకోవడం రాజమండ్రికి గర్వకారణం. హైదరాబాదు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళావేదికపై వాసాపౌండేషన్ జూన్ 6 తేదీ సాయంత్రం 6 గంటలకు ఈ పురస్కారం అందిస్తారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు, తెలంగాణ రాష్ట్ర సలహాదారు శ్రీ రమణాచారి ఐఏఎస్, ప్రముఖ కవి సుధామ, శ్రీమతి ముదిగొండ సుజాత రెడ్డి తదితరుల చేతి మీదుగా డాక్టర్, సప్పా ఈ పురస్కారాన్ని అందుకుంటారు. జాతీయ ఉత్తమ కథగా ప్రథమ బహుమతి 5000 రూపాయల నగదు, జ్ఞాపిక, పట్టు శాలువాతో సప్పాను సన్మానిస్తారు.ప్రముఖులు సప్పాకు అభినందనలు తెలిపారు.

# చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి అధిక ప్రాధాన్యత

### ఎన్‌టిఆర్ సామాజిక పెన్షన్లు అందించిన కుడుపూడి సత్తిబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరంలోని మూడో వార్డు నెహ్రూనగర్, సుబ్బారావుపేట ప్రాంతాల్లో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆదివారం ఉదయం సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడిన ఆయన వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. పెన్షన్ అందుకున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర లబ్ధిదారులు ప్రభుత్వానికి కూటమి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ, రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే శ్రీ ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో నగరంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పెన్షన్లు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో టెక్నికల్ సమస్యలు, ఇతర కారణాలను చూపిస్తూ అనేక మంది అర్హులను పెన్షన్ జాబితాల నుంచి తొలగించారని ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో దరఖాస్తులను పరిశీలించి పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందేలా కృషి చేస్తున్నారని కొనియాడారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. వృద్ధాప్యంలో ఆసరాగా నిలిచే సామాజిక పెన్షన్లు వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని, లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్యా మాఫియాను అరికట్టాలి

### గుర్తింపు లేని విద్యా సంస్థలపై ఉక్కు పాదం మోపాలి : పిడిఎస్‌యు డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగం కొంతమంది కార్పొరేట్ విద్యా వ్యాపారుల చేతుల్లో బందీగా మారింది. ప్రభుత్వ గుర్తింపు లేకుండా, నిబంధనలను తుంగలో తొక్కుతూ, అనుమతులు లేకుండానే అనేక పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, కోచింగ్ సెంటర్లు యథేచ్ఛగా నిర్వహించబడుతున్నాయి. సంబంధిత శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల విద్యా మాఫియా మరింత రెచ్చిపోతోంది. జిల్లాలో అనేక విద్యాసంస్థలు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండా సబ్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయి. విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, ఉన్నత విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు.కొన్ని కోర్సులు ఆకర్షణీయ పేర్లతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు.తప్పుడు ర్యాంకులు, నకిలీ ఫలితాలు, అసత్య ప్రకటనలతో విద్యను వ్యాపార వస్తువుగా మార్చి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. విద్యార్థుల ప్రతిభను పెంపొందించడంకంటే ఫీజుల వసూళ్లపైనే దృష్టి పెడుతున్నారు. మరోవైపు ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు నిత్యం వేలాది మంది విద్యార్థులను తరలిస్తున్నాయి. రవాణా నిబంధనలు పాటించకుండా, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా బస్సులు నడుస్తున్నప్పటికీ ఆర్‌టిఓ అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరం. ఈ అవినీతి వ్యవస్థ కారణంగానే గుర్తింపు లేని విద్యాసంస్థలు నిర్భయంగా కొనసాగుతున్నాయి. అందువల్ల తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని గుర్తింపు లేని విద్యాసంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమ అడ్మిషన్లు, అనధికారిక సబ్ బ్రాంచ్‌లు, నకిలీ ప్రచారాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను స్వాధీనం చేసుకొని బాధ్యులపై కేసులు నమోదు చేయాలి. ఈ అక్రమాలకు సహకరించిన అధికారులపై అవినీతి నిరోధక శాఖతో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. విద్య హక్కు... వ్యాపారం కాదు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటంలో ప్రభుత్వం విఫలమైతే పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేపడతామనీ హెచ్చరించారు.

# మెగా డిఎస్సీపై ఆరోపణలపై విచారణ జరపాలి

### డీఎస్సీ అవకతవకలపై వైసీపీ భారీ నిరసన ర్యాలీ - జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత - కలెక్టరేట్ ముందు బయటాయింపు-నిరసనలు






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, తక్షణం విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తూర్పు గోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు తలారి వెంకట్రావు, ధనలక్ష్మి, జక్కంపూడి విజయలక్ష్మి, ముఖ్య నాయకులు, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని బయట కొద్దిసేపు బైటాయించి ధర్నా చేశారు. అనంతరం మెగా డిఎస్సీపై వచ్చిన అక్రమాల ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ నిర్వహణలో అక్రమాల ఆరోపణలపై తక్షణం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నిర్వహణ ప్రక్రియపై నిరుద్యోగ యువతలో అనేక అనుమానాలు వ్యక్త మవుతున్నాయన్నారు. మెగా డీఎస్సీ లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేసే అంశమని, ఈ ప్రక్రియలో పారదర్శకత లోపించడం, మెరిట్ లిస్ట్ ప్రకటించకపోవడం, కేవలం ఎంపికైన అభ్యర్థులకే ఎస్ఎంఎస్ లు పంపించడం.. తదితరాలన్నీ అనుమానాలు రేకెత్తిస్తున్నాయన్నారు. పక్కాగా పరీక్షలు నిర్వహించినప్పుడు పక్కాగా జాబితా, మెరిట్ లిస్టు, మార్పుల వివరాలు కచ్చితంగా బహిర్గతం చేయాలన్నారు. అత్యంత రహస్యంగా నిర్వహించాల్సిన ప్రక్రియలో ప్రశ్నాపత్రాల తయారీ, అప్లోడ్ ప్రక్రియలో కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని ఆరోపణలు ఉన్నాయన్నారు. పరీక్షలు రాసి జిల్లా స్థాయిలో టాపర్, రాష్ట్రస్థాయిలో ర్యాంకింగ్‌గా ఉన్న అభ్యర్థి పై వచ్చిన ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో లిస్టులో పేరు మాయం వంటి ఆరోపణలతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నా. స్పోర్ట్స్ కోటా, కాల్ లెటర్లు, రిజర్వేషన్లై కూడా ఆరోపణలు వచ్చాయని, కోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేసి, నష్టపోయిన వారికి న్యాయం చేయాలని, మొత్తంగా మీ వ్యవహారంపై సిబిఐ గానీ, సిట్టింగ్ జడ్జ్ తో గాని విచారణ జరిపించాలని మా పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

# బొడ్డు చేతుల మీదుగా 50వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. సోమవారం పశ్చిమ గోనగూడెం గ్రామానికి చెందిన కాంద్రేగుల గణపతి ఇటీవల అస్వస్థతకు గురై శాస్త్రచికిత్స చేయించుకున్నారు. కాంద్రేగుల గణపతి కుటుంబానికి బొడ్డు వెంకటరమణ చౌదరి, పలువురు తెదేపా నాయకుల చేతుల మీదుగా 50వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధిత కుటుంబసభ్యులకి అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజానగరం నియోజకవర్గం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ, నిరుపేదల ఆరోగ్యానికి పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేయడం పట్ల చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు తెదేపా జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి, శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, తెదేపా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కంటే నాగ కేశవరావు, రొంగల శ్రీనివాస్, కొయ్యే సామ్యూల్, దూది కాంతారావు, మాత ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల మధ్య శెట్టి జగదీష్ జన్మదినోత్సవం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా ఉంచి, పేదల ఆకలి తీర్చే సేవా కార్యక్రమంతో టీడీపీ నగర కోశాధికారి, 22వ డివిజన్ ఇన్‌చార్జి శెట్టి జగదీష్ తన జన్మదినాన్ని అర్థవంతంగా జరుపుకున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న అన్న క్యాంటీన్ల సేవలను మరింత ప్రోత్సహించేలా సోమవారం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌లో వందలాది మందికి ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచనల మేరకు శెట్టి జగదీష్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, పార్టీ నాయకుడు మాటూరి సిద్దార్థ తదితరులు పాల్గొని స్వయంగా భోజనాలు వడ్డించారు. జన్మదిన వేడుకను పేదల మధ్య నిర్వహించడం ద్వారా సమాజానికి సేవ చేయాలనే సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా శెట్టి జగదీష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం



పునఃప్రారంభించిన అన్న క్యాంటీన్లు నిరుపేదలు, కార్మికులు, దినసరి కూలీలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని అన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన భోజనం అందించడం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపశమనం కలుగుతోందని పేర్కొన్నారు. తన జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేదల మధ్య వేడుక జరుపుకోవాలని సూచించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇకపై తమ కుటుంబంలో జరిగే ప్రతి శుభకార్యాన్ని కూడా అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనాలు అందించడం ద్వారా జరుపుకుంటామని వెల్లడించారు. ప్రజాసేవే పరమావధిగా భావిస్తున్న కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు మరింత విస్తరించాలని, పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు శాశ్వతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అన్న క్యాంటీన్లు నిరుపేదలకు వరంగా మారాయని శెట్టి జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త రాజేష్, బ్రింగుమళ్ల నారాయణ, తనోజ్, పూర్ణ, పైండా రవి, రామ్ జి, శ్రావణ్, సిహెచ్ రాము, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని శెట్టి జగదీష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా మాతృశ్రీ అంకాలమ్మ గ్రామోత్సవం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ గ్రామదేవత మాతృశ్రీ అంకాలమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం మాతృశ్రీ అంకాలమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో గరగ నృత్యాలు,తీన్మార్ డబ్బులు, భాజ భజంత్రీలు, కోలాటం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తూ, అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారిని దర్శించుకుని, పసుపు కుంకుమలు గాజులు పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



### అల్లు అర్జున్ సరసన మలయాళ ముద్దుగుమ్మ..

# రాకలో ఆ అమ్మడు కూడా..



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాలతో దూసుకుపోతున్నాడు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తున్నారు. ఇటీవలే పుష్ప సినిమాతో భారీ హిట్ అందుకున్నాడు అల్లు అర్జున్, పుష్ప 1 అలాగే పుష్ప 2 రెండు సినిమాలు భారీ విజయాలను అందుకున్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప సినిమాతో పాన్ ఇండియా స్టార్ గా మారిపోయాడు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప సినిమా సంచలన విజయాన్ని అందుకుంది. దాంతో దేశ విదేశాల్లో అల్లు అర్జున్ క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. పుష్ప 2 సినిమా కూడా భారీ విజయాన్ని అందుకుంది. దాంతో బన్నీ ఐకాన్ స్టార్ గా మారిపోయాడు. ప్రస్తుతం బన్నీ అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. ఈ సినిమాకు రాక అనే టైటిల్ ను ఖరారు చేశారు. అలాగే ఈ సినిమా నుంచి అల్లు అర్జున్ లుక్ ను కూడా రిలీజ్ చేశారు. ఈ సినిమా హాలీవుడ్ రేంజ్ లో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు అట్లీ. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ తమిళ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.800 కోట్ల బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తోంది. కాగా ఈ సినిమాలో అల్లు అర్జున్ మూడు, నాలుగు గెటప్స్ లో కనిపించనున్నాడని టాక్ వినిపిస్తుంది. అలాగే దీపికతో పాటు మరికొంతమంది హీరోయిన్స్ కూడా నటిస్తున్నారని తెలుస్తుంది. రాక సినిమాలో దీపికాతోపాటు దీపికా పదుకొణెతో పాటు జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్, రష్మికా మందన్నా, భాగ్యశ్రీ బోర్సే వంటి హీరోయిన్లు కూడా ఈ సినిమాలో నటించనున్నారనే ప్రచారం సాగుతోంది. కాగా ఇప్పుడు మరో ముద్దుగుమ్మ పేరు తెరపైకి వచ్చింది. అల్లు అర్జున్ సినిమా కోసం మలయాళ ముద్దుగుమ్మను రంగంలోకి దింపనున్నారని తెలుస్తుంది. నటి ఫెమినా జార్జ్ అల్లు అర్జున్ రాక సినిమాలో నటిస్తుంది. ఈ విషయాన్నీ ఆమె స్వయంగా తెలిపింది. ఇటీవల ఓ సినిమా ఈవెంట్ లో పాల్గొన్న నటి ఫెమినా జార్జ్. 'రాకా' లాంటి పెద్ద ప్రాజెక్ట్‌లో భాగమవుతానని ఊహించలేదని అన్నారు.. అల్లు అర్జున్ సినిమాలో నటిస్తా అని కలలో కూడా ఊహించలేదు.. అల్లు అర్జున్ నటించిన హ్యాపీ సినిమా నేను మొదట చూసిన మూవీ.. ఇప్పుడు ఆయన సినిమాలో అదికూడా అంత పెద్ద ప్రాజెక్ట్‌లో భాగం అవుతున్నందుకు హ్యాపీగా ఉంది అంటూ చెప్పుకొచ్చింది.

# నా అందానికి రహస్యం అదే..

### సీరియల్ బ్యూటీ లహరి ఆసక్తికర కామెంట్స్

సీరియల్ నటి లహరి తన కెరీర్, వ్యక్తిగత జీవితంపై మాట్లాడారు. ఇరవై సీరియల్స్‌లో ప్రధాన పాత్రలు పోషించిన ఆమె, ప్రస్తుతం సీరియల్స్ కు బ్రేక్ ఇచ్చారు. యూట్యూబ్ ఛానెల్ నిర్వహణతో తీరిక లేకుండా ఉన్న లహరి, పని ఒత్తిడిని, ప్రతికూలతలను ఎలా ఎదుర్కొంటారో వివరించారు. ప్రముఖ సీరియల్ నటి లహరి ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ అలాగే వ్యక్తిగత జీవితం గురించి వివరించారు. తన సహజ సౌందర్య రహస్యంపై అడిగిన ప్రశ్నకు, ఇది దేవుడు ఇచ్చిన గిఫ్ట్ అని, తన తల్లి నుంచి వచ్చిన బహుమతి అని ఆమె తెలిపారు. అలాగే ప్రత్యేకంగా తన చర్మ సంరక్షణకు ఎక్కువ కష్టపడనని, సాధారణ ఆహారపు అలవాట్లతో ఉంటానని లహరి తెలిపారు. కెరీర్ విషయానికి వస్తే, లహరి ఇప్పటివరకు దాదాపు ఇరవై సీరియల్స్‌లో ప్రధాన పాత్రలు పోషించారు. ప్రస్తుతం సీరియల్స్ కు బ్రేక్ ఇచ్చారు లహరి. ప్రస్తుతం పలు ఈవెంట్‌లతో పాటు తన యూట్యూబ్ ఛానెల్‌తో కూడా తాను బిజీగా ఉన్నానని, కుటుంబానికి తగిన సమయం కేటాయిస్తున్నానని చెప్పారు. షూట్ గ్యాప్‌లలో కుటుంబాన్ని చూసుకుంటానని, సమయాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నానని లహరి తెలిపారు. తాను చేసిన అన్ని పాత్రలను ఇష్టపడతానని, తనకు నచ్చని పాత్ర అంటూ ఏదీ లేదని పేర్కొన్నారు. సీరియల్ కథలు, పాత్రల కొనసాగింపు జనాల రేటింగ్స్‌పై ఆధారపడి ఉంటాయని ఆమె వివరించారు. ప్రేక్షకులు చూడకపోతే సీరియల్ నిలిచిపోతుందని, ఒక పాత్రను ఎక్కువగా చూస్తే కొనసాగిస్తారని, లేకపోతే తీసేస్తారని లహరి పేర్కొన్నారు. సీరియల్ పరిశ్రమలో ఏమైనా జరగవచ్చని, రచయితల చేతుల్లో కూడా పూర్తి నియంత్రణ ఉండదని ఆమె అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత జీవితంలో ప్రతికూలతలను, దుఃఖాన్ని తన దరిచేరనీయనని లహరి తెలిపారు. చిన్న విషయాలను సీరియస్‌గా తీసుకోనని, దానివల్ల మానసిక ఒత్తిడికి దూరంగా ఉంటానని చెప్పారు. తాను ప్రశాంతమైన వ్యక్తిని అని, తోటి నటులతో గొడవల జోలికి వెళ్లనని, అనవసర విషయాలను పట్టించుకోనని లహరి స్పష్టం చేశారు. హైదరాబాద్ అమ్మాయిగా, తెలుగు అమ్మాయిగా ఇక్కడ గుర్తింపు పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆమె అన్నారు. ఇతర రాష్ట్రాల నటులు ఇక్కడికి వచ్చినా, తెలుగు నటిగా తనకంటూ ఒక ప్రత్యేకత ఉంటుందని లహరి పేర్కొన్నారు.



# ఇంతకీ వైభవ్ చెవిలో విరాట్ ఏం చెప్పాడు..

### ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న లక్కీ మూమెంట్




టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లీ, ఈ సీజన్ సెన్సేషన్, 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ మధ్య జరిగిన అద్భుతమైన భేటీ. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో వీరిద్దరూ పంచుకున్న ఓ ప్రత్యేకమైన క్షణం ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా మే 31న జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆర్సీబీ టైటిల్ గెలిచిన ఆనందంలో ఉండగానే, సోషల్ మీడియాలో మరో హార్ట్ టచింగ్ వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది. అదే.. టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లీ, ఈ సీజన్ సెన్సేషన్, 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ మధ్య జరిగిన అద్భుతమైన భేటీ. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో వీరిద్దరూ పంచుకున్న ఓ ప్రత్యేకమైన క్షణం ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆర్సీబీ పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో అదరగొట్టింది. మొదట గుజరాత్‌ను 20 ఓవర్లలో 155 పరుగులకే కట్టడి చేసిన బెంగళూరు, ఆ తర్వాత 161 పరుగులు చేసి కేవలం 18 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లీ ముందుండి జట్టును నడిపిస్తూ 75 పరుగులతో అజేయంగా నిలవడమే కాకుండా, విన్నింగ్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించి ఆర్సీబీని చాంపియన్‌గా నిలబెట్టాడు. మ్యాచ్ ముగిసి ప్రెజెంటేషన్ వేడుక జరగడానికి కాస్త ముందు, కెమెరాలు మైదానంలో ఒక అద్భుతమైన దృశ్యాన్ని బంధించాయి. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడి, సీజన్ ముగిసినా స్టేడియంలో ఉన్న వైభవ్ సూర్యవంశీ.. విరాట్ కోహ్లీని చూడగానే ఎంతో గౌరవంతో రెండు చేతులు జోడించి నమస్కరించాడు. దానికి కోహ్లీ కూడా ఎంతో ప్రేమగా స్పందిస్తూ, ఆ చిన్నారి క్రికెటర్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి భుజం తట్టాడు. అంతేకాదు, వైభవ్‌తో కాసేపు మాట్లాడి కెరీర్‌కు ఉపయోగపడే కొన్ని విలువైన సూచనలు, సలహాలు ఇచ్చాడు. వీరిద్దరి మధ్య ఏం సంభాషణ జరిగిందనేది బయటకు రాకపోయినా, ఈ ఫోటోలు, వీడియోలు మాత్రం ఇంటర్నెట్‌లో విపరీతంగా హల్చల్ చేస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ జట్టు క్వాలిఫైయర్-2 లోనే నిష్క్రమించినప్పటికీ, వైభవ్ సూర్యవంశీ వ్యక్తిగత ప్రదర్శన మాత్రం ఒక సంచలనం. ప్రపంచ స్థాయి బౌలర్లను సైతం వణికించిన ఈ 15 ఏళ్ల కుర్రాడు ఈ సీజన్లో ఏకంగా 5 ప్రతిష్టాత్మక అవార్డులను ఎగరేసుకుపోయాడు. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్, సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్, ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ అవార్డులను వైభవ్ గెలుచుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 మ్యాచ్‌లు ఆడిన వైభవ్.. 48.50 అద్భుతమైన సగటుతో, 237.30 మైండ్ బ్లోయింగ్ స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు కూడా ఉన్నాయి. ఐపీఎల్ 2026 ముగిసి ఉండవచ్చు కానీ, వైభవ్ సూర్యవంశీ అసలు సిసలైన ప్రయాణం ఇప్పుడే మొదలైంది. ఈ వండర్ కిడ్ త్వరలోనే టీమిండియా జెర్సీలో కనిపించబోతున్నాడు. జూన్ 9, 2026 నుంచి శ్రీలంక వేదికగా ప్రారంభం కానున్న భారత్-ఏ, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ జట్ల వన్డే ట్రై-సిరీస్ కోసం వైభవ్ సూర్యవంశీని ఇండియా-ఏ జట్టుకు సెలెక్టర్లు ఎంపిక చేశారు. దీంతో ఫ్యాన్స్ ఈ బుడ్డోడి పవర్ ప్యాక్డ్ పర్ఫార్మెన్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అర్ధరాత్రి ఐసీసీ సంచలన నిర్ణయం..

### ఆ దేశ క్రికెట్ బోర్డుపై తక్షణమే నిషేధం




ఐసీసీ తాజాగా ఒక ఊహించని నిర్ణయం తీసుకుని క్రీడా ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇప్పటివరకు పలు ప్రపంచకప్ టోర్నమెంట్లలో పాల్గొన్న కెనడా క్రికెట్ బోర్డు పై ఐసీసీ తక్షణమే అమలులోకి వచ్చేలా సస్పెన్షన్ వేటు వేసింది. ఐసీసీ సభ్యత్వ నిబంధనలను, బాధ్యతలను కెనడా క్రికెట్ బోర్డు తీవ్రంగా ఉల్లంఘించిందనే ఆరోపణల నేపథ్యంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. మే 31న అహ్మదాబాద్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ కీలక తీర్పు వెలువడింది. కెనడా క్రికెట్ బోర్డును సస్పెండ్ చేస్తున్నట్లు ఐసీసీ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే ఈ నిషేధం కేవలం అడ్మినిస్ట్రేషన్ కు మాత్రమే పరిమితం కానుంది. దీనివల్ల కెనడా దేశానికి చెందిన క్రికెట్ ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగదు. వారు ఎప్పటిలాగే ఐసీసీ నిర్వహించే అన్ని అంతర్జాతీయ టోర్నమెంట్లలో సాధారణంగానే పాల్గొనవచ్చని ఐసీసీ భరోసా ఇచ్చింది. ఆటగాళ్ల భవిష్యత్తు, వారి ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండటం కోసం ఐసీసీ ఒక ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ ద్వారా నిధులను నేరుగా అందజేయనుంది. కెనడా క్రికెట్ బోర్డుపై విధించిన ఈ నిషేధాన్ని ఎత్తివేయడానికి ఐసీసీ కొన్ని కఠినమైన షరతులను విధించింది. బోర్డులోని పరిపాలనా లోపాలను, ఆర్థిక అవకతవకలను పూర్తిగా సరిదిద్దడమే ఈ షరతుల ముఖ్య ఉద్దేశం. కెనడా బోర్డు ఈ దిశగా పనులు చేస్తోందా లేదా అని నిరంతరం గమనించడానికి, పర్యవేక్షించడానికి ఐసీసీ ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయబోతోంది. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే భవిష్యత్తులో కెనడా బోర్డు పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఐసీసీ మీటింగ్‌లో కెనడా నిషేధంతో పాటు మరికొన్ని చారిత్రాత్మక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. సాధారణంగా టెస్ట్ మ్యాచ్‌లలో వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు ఆటను ముందే ముగించేస్తుంటారు, ఇది ఫ్యాన్స్‌కు తీవ్ర నిరాశ కలిగిస్తుంది. దీనిని నివారించడం కోసం.. మ్యాచ్ సమయంలో వెలుతురు తగ్గినప్పుడు ఇరు జట్ల కెప్టెన్లు అంగీకరిస్తే గనుక, ఎరుపు రంగు బంతికి బదులుగా పింక్ బాల్ ఉపయోగించవచ్చనే సరికొత్త ప్రతిపాదనకు ఐసీసీ ఆమోదం తెలిపింది. దీనివల్ల రాబోయే రోజుల్లో సాధారణ టెస్ట్ మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్ మ్యాజిక్ కనిపించనుంది. ఈ కీలక సమావేశంలో పురుషుల టీ20 వరల్డ్ కప్‌కు సంబంధించిన క్వాలిఫైయింగ్ ప్రక్రియపై కూడా చర్చలు జరిగాయి. రాబోయే ప్రపంచకప్ టోర్నీల కోసం ఒక భారీ గ్లోబల్ క్వాలిఫైయర్ టోర్నమెంట్‌ను నిర్వహించే విషయంపై ఐసీసీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. దీనివల్ల అసోసియేట్ దేశాలకు ప్రపంచకప్‌కు అర్హత సాధించేందుకు మరింత సమానమైన అవకాశాలు లభిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ లీగ్ క్రికెట్ (ఐపీఎల్, పీఎస్ఎల్, బిగ్ బాష్ వంటి ఫ్రాంచైజీ టోర్నీలు) విపరీతంగా పెరిగిపోతుండటంపై ఐసీసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌కు, ఈ ప్రైవేట్ ఫ్రాంచైజీ లీగ్‌ల షెడ్యూల్‌కు మధ్య సరైన సమతుల్యతను కాపాడటం ఎలా అనే అంశంపై ఐసీసీ దృష్టి సారించింది. లీగ్ క్రికెట్ వల్ల అంతర్జాతీయ మ్యాచులు దెబ్బతినకుండా ఉండేందుకు, దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడానికి ఐసీసీ ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com